ఆంధ్రజ్యోతి


గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.0

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శనివారం 1 నవంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.80 (311.4474)	88,650	88,650
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.30 (4.02)	10,825.51	12,979.48
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.618 (40.6787)	84,370	98,285

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



ధాన్యం కొనుగోళ్లు నిలిచాయి

- తాత్కాలికంగా నిలిపివేసిన ప్రభుత్వరంగ సంస్థలు
- ఆరబెట్టిన తరువాతే ధాన్యం, పత్తి కొనుగోళ్లు
- ఇప్పటి వరకు వరి 49వేల మెట్రిక్ టన్నులు, పత్తి 900 క్వింటాళ్ల కొనుగోలు

ఆడపాదడపా కురిసిన వర్షాలకు తోడు మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రైతులకు నష్టం మిగిలింది. తుఫాన్‌తో ధాన్యం, పత్తి తడవడంతో ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోళ్ల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశాయి. ధాన్యం, పత్తిని ఆరబెట్టి న తరువాతే కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

తేమతో సంబంధం లేకుండా తడిసిన ధాన్యం, పత్తి కొనుగోళ్లను సేకరించాలనే డిమాండ్‌పై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాకపోవడంతో ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేయడం లేదు. మొంథా తుఫాన్ ప్రభావంతో పాటు ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలతో జిల్లాలో 61వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. అదేవిధంగా నూర్పిడి చేసిన 4,800 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసింది. దాదాపు 180 ధాన్యం రాశులు నీటిలో కొట్టుకుపోయాయి. చాలా చోట్ల ధాన్యం మొలకెత్తుతుండగా, పత్తి పింజ తడిసి ముద్దయి నల్లబారుతోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చే ముందు చేజారిపోవడంతో వారికి కంటి మీద కునుకు లేకుండాపోయింది. జిల్లాలో మూడు రోజుల పాటు కురిసిన అకాల వర్షాలు, తుఫాన్ ప్రభావంతో రైతులు నష్టపోయారు. ఒక్కో రైతు పెట్టుబడులు పెట్టి పంట విక్రయించే సమయంలో వర్షాలు నిండా ముంచాయి.

మందకొడిగా సీసీఐ పత్తి కొనుగోళ్లు

జిల్లాలో ఈనెల 24వ తేదీ నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభించింది. సీసీఐ కొనుగోళ్లు చేపట్టిన రోజు నుంచి తరచూ వర్షాలు వెంటాడుతున్నాయి. జిల్లాలో 23 జిన్నింగ్ మిల్లు ఉన్నాయి. తొమ్మిది ఎల్-1 జిన్నింగ్ మిల్లుల్లో అధికారులు పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో వారం రోజుల్లో కేవలం 900క్వింటాళ్ల పత్తిని మాత్ర మే కొనుగోలు చేశారు. వర్షాలకు పత్తి తడవగా, ఆరబెట్టిన తరువాత తీసుకురావాలని సీసీఐ కేంద్రాల నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. దీనికి తోడు స్లాట్ బుకింగ్ ఉండటంతో రైతులు పత్తిని వెంటనే విక్రయించే పరిస్థితి లేదు. 8 నుంచి 12శాతం తేమ ఉంటేనే పత్తిని కొనుగోలు చేస్తారు. నాణ్యమైన పత్తికి క్వింటాకు రూ.8,110 చెల్లిస్తారు. అయితే జిల్లాలో ప్రస్తుతం రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో 5.60లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, 57లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పత్తి వస్తుందని, ఎకరాకు 10 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే ప్రకృతి వైపరీత్యాలతో ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రధానంగా ఎర్రతెగులు, ముడత తెగులుతోపాటు వరుసగా కురుస్తున్న వర్షాలకు పత్తి చేలు దెబ్బతిన్నాయి. పత్తి ఆరిన తరువాతనే స్లాట్ బుకింగ్ ద్వారా తీసుకరావాలని సీసీఐ స్పష్టం చేయడంతో రైతులు అయోమయంలో పడిపోయారు. తేమతో సంబంధం లేకుండా ధాన్యం, పత్తిని కొనుగోలు చేస్తే తప్ప రైతులు గట్టెక్కే పరిస్థితి లేదు.

49వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

ప్రభుత్వరంగ సంస్థలు ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిన నాటి నుంచి ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. ఆడపాదడపా వర్షాలకు తోడు తుఫాన్ రైతును దెబ్బతీసింది. కొద్ది రోజులుగా ప్రారంభించిన ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగాయి. ఇప్పటి వరకు జిల్లాలో 49,152 మెట్రిక్ టన్నుల ధాన్యాన్నే ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేశాయి. 6లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే వర్షాల కారణంగా ధాన్యం తడిసి తేమ పెరిగింది. దీంతో రైతులు కల్లాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికే ఐకేపీ కేంద్రాల్లో 1,79,460 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంది. ప్రస్తుతం ధాన్యంలో తేమ తగ్గితేనే గానీ కొనుగోలు చేసే పరిస్థితి లేదు. తడిసిన ధాన్యంతో పాటు మొలకెత్తిన ధాన్యాన్ని, తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకారం తేమ 17 శాతం ఉంటేనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవడం, ధాన్యం తడవడంతో తేమశాతం తగ్గే పరిస్థితి లేదు. దీనికి తోడు అస్తవ్యస్తంగా ఉన్న ఐకేపీ కేంద్రాలతో సమస్యలు ఎదురవుతున్నాయి. రాళ్లు, రప్పలు, గుంతలను చూడకుండా పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం రాశులపై కప్పేందుకు టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో రైతులు నష్టపోయారు.

ఈ సారైనా మెరుగుపడేనా?



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల నమోదు ను పెంచేందుకు ఇంటర్ విద్యాశాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అయితే విద్యార్థుల నమోదు పెరిగినంత మాత్రాన ఉపయోగం లేదని, ప్రైవేట్ కళాశాలల కంటే మెరుగైన విద్యనందించి వారితో తక్కువ కాదని నిరూపించేందుకు జిల్లా ఇంటర్ విద్యా శాఖ చర్యలు ప్రారంభించింది. మరి ఈ విద్యా సంవత్సరంలోనైనా ఫలితాలు మెరుగుపడతాయో లేదో చూడాల్సిందే.

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట(కలెక్టరేట్)

గత విద్యా సంవత్సరంలో ఇంటర్ వార్షిక ఫలితాల్లో సూర్యాపేట జిల్లా రాష్ట్రంలో 20కి పైగా స్థానంలో ఉంది. ప్రైవేట్ జూనియర్ కళాశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నారు. అయితే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాత్రం వందశాతం ఫలితాలు రావడం లేదు. 2023- 2024లో ఇంటర్ ప్రథమంలో 48శాతం, ద్వితీయంలో 61శాతం ఉత్తీర్ణత వచ్చింది. ఈ ఏడాది రాష్ట్రంలో సూర్యాపేట జిల్లాకు 28వ స్థానం, ద్వితీయ సంవత్సరంలో 24వ స్థానం దక్కింది. 2024-25 వార్షిక ఫలితాల్లో ప్రథమలో 8,068 మంది విద్యార్థులకు 4,420 మంది ఉత్తీర్ణత (54శాతం) సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 7,518 మంది విద్యార్థులకు 4,983 మంది ఉత్తీర్ణత (66.25 శాతం) సాధించారు. మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి 15,586 మందికి 9,403 మంది ఉత్తీర్ణత (60.32 శాతం) సాధించారు. యాదాద్రి జిల్లాలో 2023-24లో మొదటి, ద్వితీయ సంవత్సరం కలిపి 11,687 మంది విద్యార్థులకు 6,467 మంది ఉత్తీర్ణత (54.50శాతం) సాధించారు. 2024 -25 లో 11,738మందికి 7,390మంది ఉత్తీర్ణత (62.96 శాతం) సాధించారు. ఈ ఏడాది గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇంటర్ అధికారులు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. అందులో భాగంగా ఇప్పటికే సిలబస్‌ను 70శాతం పూర్తి చేశారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థు లు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా పరీక్ష లు రాసి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి కే పలుమార్లు స్లిప్‌టెస్టులు నిర్వహించారు. కాగా, వచ్చే ఏడాది జనవరి నుంచి ఒక్కో సబ్జెక్టుకు సం బంధించి స్లిప్‌టెస్టులు నిర్వహించనున్నారు. ఈ ఫలితాల ప్రకారం విద్యార్థుల్లోని సామర్థ్యాన్ని పరిశీలించి మార్చిలో జరగను న్న వార్షిక పరీక్షలకు సమాయత్తం చేయనున్నారు. గతంలో సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశా ల, నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పా టు పలు కళాశాలల్లో ఆశించిన మేర ఫలితాలు రాలేదు. చాలా మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారు.

ప్రత్యేక వార్షిక ప్రణాళిక...

ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రం లో మెరుగైన స్థానం సాధించేందు కు ఈ ఏడాది కళాశాలల ప్రారంభం నుంచే విద్యార్థులకు ప్రత్యేక వార్షిక ప్రణాళిక రూపొందించారు. ఈనెల...

- మిగతా 7వ పేజీలో...

దేశ సమగ్రతకు కృషిచేసిన పటేల్



రన్‌ఫర్ యూనిటీని ప్రారంభించి పాల్గొన్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎస్పీ శరత్‌చంద్ర పవార్


నల్లగొండ క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రత, ఐక్యత కోసం కృషి చేసిన గొప్ప దేశభక్తుడు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ రన్ ఎన్జీ కళాశాల నుంచి క్లాక్‌టవర్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించి 550కు పైగా సంస్థానాలను దేశంలో విలీనం చేయడంలో వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించడాన్ని కొనియాడారు. అనంతరం పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రాజశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మయ్య, జితేందర్‌రెడ్డి, శ్రీనునాయక్, రఘువీర్‌రెడ్డి, ఆర్ఐ సంతోష్, 500మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి : ఎస్పీ

(ఆంధ్రజ్యోతి, పెద్దవూర): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల్లో ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీచేశారు. పలు కేసుల వివరాలు అడిగి తెలుసుకొని మాట్లాడారు. డయల్ 100కు వచ్చే కాల్స్‌కు తక్షణమే స్పందించాలన్నారు. గ్రామ పోలీసు అధికారులు ప్రతీ రోజు గ్రామాలను సందర్శించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. యువత మాదకద్రవ్యాలు బారిన పడకుండా చూడాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ శ్రీనునాయక్, ఎస్ఐ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

నాంపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. మందుల స్టాక్, పలు రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను ఆస్పత్రి వైద్యాధికారులు డాక్టర్ భవానిసాగర్, డాక్టర్ తరుణ్‌ను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, డాక్టర్ రవి, డాక్టర్ కృష్ణకుమారి, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

నిడమనూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డీఆర్డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఊట్కూరు, మార్వాక గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీచేశారు. రిజిస్టర్లు పరిశీలించి సిబ్బంది, రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్నందున కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. వర్షాలకు రంగు మారిన ధాన్యాన్ని కూడా తేమ శాతం ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోళ్ల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏపీఎం నరహరి, తదితరులు ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కలెక్టర్ ఇలా త్రిపాఠి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన విద్యతో సమాజంలో ఉన్నత స్థాయి, ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో కలిసి కస్తూర్బా గాంధీ పాఠశాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థినులు చక్కగా చదువుకోడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మెనూ ప్రకారం ఆహారాన్ని అందిస్తున్నారా అని ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని పాఠశాల ఎస్‌వో కవితను ఆదేశించారు. పాఠశాలలో రికార్డులను, ఫేస్ రికగ్నేషన్ యాప్ అటెండెన్స్ తీరును పరిశీలించారు. పాఠశాలలో డే వాచ్ మెన్ పోస్టు భర్తీకి చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల భవనాలను నిర్మించేందుకు అనువైన స్థలాన్ని వ్యవసాయ సబ్ మార్కెట్‌యార్డులో పరిశీలించారు. ఆ తరువాత తహసీల్దార్ కార్యాలయంలో పలువురు రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డీఈవో భిక్షపతి, తహసీల్దార్ అనిల్, ఇన్‌చార్జి ఎంపీడీవో భిక్షంరాజు, ఎంఈవో కె.శ్రీనివాస్, ఏఈ సైదులు, తదితరులు ఉన్నారు.

వెంటనే మిల్లులకు తరలించాలి

(ఆంధ్రజ్యోతి, హాలియా): నిబంధనల ప్రకారం ధాన్యంలో తేమశాతం రాగానే కాంటాలు వేసి వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం అనుముల మండలం రామడుగు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీచేశారు. కొనుగోలు, మిల్లర్ల విషయంలో ఇబ్బందులు ఎదురైతే తహసీల్దార్, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ రఘు, ఉన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న భూ రికార్డులు, భూ భారతి, భూ వివాదాల దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులపై శ్రద్ధ చూపాలి



పెద్దకాపర్తి ఉన్నత పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్రవణ్‌కుమార్

మండల ప్రత్యేకాధికారి, జేడీఏ శ్రవణ్‌కుమార్

చిట్యాల రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు సత్ఫలితాలు సాధించేలా వారికి సాయంకాలం ప్రత్యేక తరగతులను నిర్వహించడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీచేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన రిజిస్టర్లను, వంటశాలలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. కోడిగుడ్లలను భోజనంలో విద్యార్థులకు వారంలో ఎన్నిమార్లు ఇస్తున్నారని ప్రశ్నించారు. పరిశుభ్ర వాతావరణంలో వంటలు చేయాలన్నారు. చేతులు శుభ్రం చేసుకున్న నీళ్ల వెళ్లేలా ఇంకుడు గుంత నిర్మించాలని సూచించారు. ఉపాధ్యాయుల బోధనలను విద్యార్థులు శ్రద్ధగా వినాలని అనంతరం పాఠ్యాంశాలను మరోమారు పఠనం చేసుకోవాలన్నారు. 10 జీపీఏ అందరూ సాధించేలా చూడాలన్నారు. విద్యార్థులు సత్ఫలితాలను సాధించడంతో పాటు మండలం, జిల్లాస్థాయిలో పాఠశాలకు పేరు ప్రఖ్యాతులను తీసుకువచ్చేలా చూడాలన్నారు. ఆయన వెంట మండల విద్యాధికారి పానుగోతు సైదానాయక్, ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సీపీఎం నేత జూలకంటి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, నవంబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి చేలు నేలవాలి రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. వేలాది ఎకరాల్లో కోతకు వచ్చిన పంట నేలవాలడంతో గింజలు నీటిలోనాని మొలకెత్తడంతోపాటు రంగు మారుతున్నాయన్నారు. రైతులు ఎకరాకు రూ.30వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టారని, అకాల వర్షాలతో పంట దిగుబడి పూర్తిగా తగ్గిందన్నారు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాల ధాన్యం రావల్సి ఉండగా, 20 బస్తాలు రావడం లేదన్నారు. వరి నేలవాలడంతో వరికోత యంత్రంతో నూర్పిడికి అదనంగా రెండున్నర గంటలు పడుతోందని, దీంతో రైతులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం వివరాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేయాలన్నారు. ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారి శర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, పాల్వాయి రాంరెడ్డి, కోట్ల శ్రీనివాసరెడ్డి, చౌగాని సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



నకిరేకల్‌లో కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాంచందర్‌రావు

నకిరేకల్, చిట్యాల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇటీవలి వర్షాలకు తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తూ శుక్రవారం చిట్యాల పీఏసీఎస్, నకిరేకల్‌లోని చీమలగడ్డ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి, మాట్లాడారు. కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పంట నష్టాన్ని అంచనా వేసేందుకు మూడు బృందాలు పర్యటిస్తున్నాయని, అందులో భాగంగానే ఖమ్మం వెళుతూ రైతుల ఇబ్బందులను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో 15 రోజులుగా రైతులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు తేమ పేరుతో కొనుగోలు చేయకపోవడంతోనే వర్షానికి తడిసి దెబ్బతిందన్నారు. కేంద్రాల్లో ప్యాడీ డ్రయర్స్ లేకపోవడంతో రైతులు నష్టపోయారన్నారు. రాష్ట్రం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు టార్పాలిన్ కవర్లు ఏర్పాటు చేయలేదని, దీంతో వర్షానికి ధాన్యం రాశులు తడిసినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మిల్లర్ల తో కుమ్మక్కై ధాన్యం కొనుగోలు విషయంలో తేమశాతం పేరుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గొంగడి మనోహర్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, వీరెల్లి చంద్రశేఖర్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

కాంటావేసిన ధాన్యాన్ని మిల్లుకు తరలించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



నార్కట్‌పల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నార్కట్‌పల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తి చేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికపుడు మిల్లుకు ఎగుమతి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం, నార్కట్‌పల్లి, తొండ్లాయిలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం తరలింపులో పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు.

జువ్విగూడెంలోని శివసాయి రైస్‌మిల్లును, అక్కెనపల్లిలోని చెన్నకేశవ రైస్ మిల్లులను సందర్శించారు. రైస్‌మిల్లుల నిల్వ సామర్థ్యాన్ని ఇప్పటికే వచ్చిన ధాన్యం నిల్వలను తెలుసుకున్నారు. ధా న్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నిల్వలను రికార్డుల ద్వారా తనిఖీచేశారు. కేంద్రానికి అలాట్ చేయబడిన రైస్ మిల్లుకు సత్వరమే ఎగుమతి చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరా అధికారి టీ.వెంకటేశ్, జేడీఏ శ్రవణ్, ఏవో గౌతమ్, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, నాయబ్ తహసీల్దార్, ఏఈవోలు ఉన్నారు.

శిశువు అక్రమ

దత్తత కలకలం

- మూడో సంతానంలో ఆడ శిశువు
- దత్తత ఇచ్చారని సమాచారంతో అధికారుల ఆరా

6

చోరీ కేసులో ఏడాది జైలు, జరిమానా

కేతేపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా నకిరేకల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి శుక్రవారం తీర్పు ఇచ్చారు. కేతేపల్లి ఎస్ఐ యు. సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇనుపాముల ఆవాస గ్రామమైన రాయపురానికి చెందిన చిన్నాబత్తిని లూర్దుమేరి గత ఏడాది డిసెంబరులో ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లింది. ఇదే అదనుగా భావించిన ఏపీలోని కృష్ణా జిల్లా కృతివెన్ను మండలానికి చెందిన గంట రంగారావు లూర్దుమేరి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని బంగారు ఆభరణాలు దొంగతనం చేశాడు. నిందితుడిపై నేరం రుజువుకావడంతో ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు.

దేవలమ్మనాగారంలో హైనా సంచారం


గాలింపు చర్యలు చేపడుతున్న ఆటవీశాఖ సిబ్బంది

చౌటుప్పల్ రూరల్ అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారం సమీపం అటవీ ప్రాంతంలో అటవీ జంతువు సంచరిస్తోందనే ప్రచారంతో రైతులు, ప్రజలు ఆందోళనకు గురయ్యారు. గాలింపు చర్యలు చేపట్టిన ఫారెస్టు సిబ్బంది సంచరిస్తోంది చిరుత కాదని హైనా అని నిర్ధారించారు. శుక్రవారం వ్యవసా య బావుల వద్దకు వెళ్లిన రైతులకు చిరుత పోలికలతో ఉన్న హైనా కన్పించింది. దీంతో రైతులు భయాందోళనలకు గురై గ్రామపెద్దలకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అటవీ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. అధికారులు అటవీ ప్రాంతానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. హైనా సంచరించిన పాదాలను గుర్తించి హైనాగా నిర్ధారించారు. దీంతో రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కుక్కల దాడిలో దూడకు గాయాలు


శస్త్రచికిత్స చేస్తున్న వెటర్నరీ డాక్టర్ పెంటయ్య

కోదాడ రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో దూడ గాయపడింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని నయానగర్‌లో శుక్రవారం జరిగింది. నయానగర్‌కు చెందిన ఓ యజమాని కొన్ని నెలల క్రితం ఇంట్లో పాల కోసం ఓ గేదెను కొనుగోలు చేశాడు. దానికి దూడ పుట్టింది. గురువారం రాత్రి పశువుల పాకలోకి చొరబడిన వీధికుక్కలు దూడను విచక్షణారహితంగా కరవడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో శుక్రవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకురాగా, దూడ కుడికాలు నరాలు దెబ్బతినడంతో రెండుగంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స చేసినట్లు పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపారు. నరాలు దెబ్బతిన్న కాలుకు సిమెంట్ కట్టుతో బ్యాండేజీ వేయడంతో దూడ లేచి నిలబడి పాలు తాగిందని తెలిపారు.

ఉరివేసుకొని..


ఇక్బాల్ మృతదేహం

సూర్యాపేటక్రైం, అక్టోబరు 31,(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకేంద్రంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బంకియార్ గ్రామానికి చెందిన ఎండీ. ఇక్బాల్(33) సూర్యాపేటలోని బాలాజీనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని కుటుంబంతో నివసిస్తున్నాడు. దుస్తుల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల భార్య సోదరుడి వివాహం ఉండడంతో ఈ నెల 29న భార్య సిమ్రాన్ పిల్లలను తీసుకుని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని స్వగ్రామానికి వెళ్లింది. మృతుడికి మద్యం సేవించే అలవాటు ఉంది. గత నెల 29న అర్ధరాత్రి వరకు అద్దెకు నివసించే ఇంట్లో మద్యం తాగాడు. గత నెల 30న తెల్లవారు జామున ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి తలుపులు తెరవకపోయే సరికి శుక్రవారం ఉదయం ఇంటి యజమాని కిటికిలో నుంచి చూడగా ఇక్బాల్ ఫ్యాన్‌కు మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించింది. ఆయన వెంటనే ఈ విషయాన్ని ఫోన్ ద్వారా మృతుడి భార్య, సోదరుడికి తెలిపాడు. వారు ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక్బాల్ సోదరుడు ఇక్రార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. ఇక్బాల్‌కు భార్య సిమ్రాన్, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తిమృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చింతపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని రాజ్యానాయక్‌తండాలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివ రాల ప్రకారం... మండలంలోని రాజ్యానాయక్ తండా సమీపంలో రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న గుర్తతె లియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తలకు గాయాలు కావడంతో సదరు వ్యక్తి(45) మృతి చెందాడు. మృతదేహంపై తెలుపు రంగు టీషర్టు, దానిపై ఫుల్ హ్యాండ్ షర్టు, ప్యాంట్ ఉంది. మృతుడిని గుర్తిస్తే సెల్: 8712670230, 8712675258 నంబర్‌కు సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధుడు..


గుర్తుతెలియని వృద్ధుడు(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఈ సం ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో శుక్రవారం జరి గింది. మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో భిక్షాటన చేస్తున్న వృద్ధుడు ఈ నెల 7న తీవ్ర అస్వస్థతకు గురయ్యా డు. 108లో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. సుమారు 70ఏళ్ల వయస్సు ఉన్న వృద్ధుడు చికిత్సపొందుతూ ఈ నెల 14వ తేదీన మృతిచెందినట్లు టూటౌన్ సీఐ సోమనర్సయ్య తెలిపారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి ఫ్రీజర్‌గదిలో భద్రపరిచామని, గుర్తించినవారు వివరాల కోసం సెల్: 8712670150లో సంప్రదించాలని సీఐ కోరారు.

ముంచిన మొంథా.. రైతన్న గోస


మోత్కూరులో నీట మునిగిన వరికి కట్టలు కడుతున్న రైతు నారాయణ

మోత్కూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని జామచెట్లబావి గ్రామంలో మర్రి నారాయణ అనే కౌలు రైతు బీసు మల్లికార్జున్‌కు చెందిన రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి ఉత్తరాది చెరువు అలుగు పోసి కౌలు రైతుకు చెందిన రెండు ఎకరాలు నీట మునిగింది. రెండు రోజులు అయినా వరద నీరు తగ్గకపోవడంతో కొంతలో కొంతైన కాపాడుకోవాలన్న తాపత్రయంలో ఆ రైతు నీట మునిగిన వరిని గొలుసుల వరకు పైకి లేపి కట్టలు కట్టాడు.

మత్స్యగిరి లక్ష్మీనృసింహస్వామి

బ్రహ్మోత్సవాలు ప్రారంభం


బ్రహ్మోత్సవాల పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వలిగొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలో మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి గుట్టపైన స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రుత్వికులు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ స్వస్తివాచనంతో ఉత్సవాలను ప్రారంభించారు. ఆగమ శాస్త్ర పద్ధతిలో విశ్వశాంతి లోకకల్యాణార్థం నిర్వహించే బ్రహ్మోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టారు.

విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం

బ్రహ్మోత్సవ ప్రారంభంలో ఆపదమొక్కుల వాడు మహావిష్ణువు సహస్రనామ స్తోత్ర పారాయణాన్ని వేదపండితులు పఠనం చేశారు.

రుత్వికుల మంత్రో చ్ఛరణలతో మచ్చగిరి కొండ మార్మోగింది. దేవతల సర్వసైన్యాధ్యక్షుడు విశ్వక్సేనుడికి తొలిపూజలతో స్వామి వారి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలతో స్వామి ప్రత్యేక పీఠంపై అలంకరించి బ్రహ్మోత్సవాలు సాగాలని తొలి పూజలు జరిపారు.

వాసుదేవ పుణ్యాహవాచనం

నారసింహుడి బ్రహ్మోత్సవ వేడుకల ఆరంభానికి పరిసరాలను శాస్త్రోక్తంగా శుద్ధి చేయడానికి పుణ్యాహవాచన పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తుల ఎదుట పంచామృత కలశాలకు దర్బలతో పూజలు జరిపారు. అనంతరం కొండపై నలుదిక్కులా పవిత్ర జలాలను జల్లి శుద్ధి చేశారు.

రక్షాబంధనం

ఆగమ శాస్త్రప్రకారం స్వామివారికి అర్చకులు కంకణధారణ చేశారు. అనంతరం నిర్వాహకులను దీక్షాబద్ధులను చేస్తూ అర్చకులు దేవస్థాన పాలకమండలి, ధర్మకర్తలు, ఈవో, ప్రముఖులకు కంకణ ధారణ చేశారు. రక్షాబంధనం పవిత్రతను అర్చకులు వివరించారు.

మృత్సంగ్రహణం

బ్రహ్మోత్సవాల ఆరంభరోజున అంకురార్పణ మృత్సంగ్రహణం సాంప్రదాయ రీతిన నిర్వహించారు. పుట్టమన్నును తెచ్చి నవధాన్యాలను నిర్దేశించిన వేదమంత్రాలతో పవిత్రీకరించి అంకురార్పణం చేశారు. భూమిపై గల పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలంగా వర్ధిల్లాలని ఆ భగవంతుని అర్చకులు వేడుకున్నారు.

ధ్వజపట ఆదివాసం

లక్ష్మీనారసింహుడి గర్భాలయ గుడికి ఎదురుగా ప్రతిష్ఠించిన ధ్వజస్తంభానికి గరుడ్మంతుడి ఛాయా చిత్రాన్ని రుత్వికులు చిత్రీకరించారు. మహావిష్ణువు వాహనమైన గరుడుని పూజించడం సాంప్రదాయం. శాస్త్రోక్తంగా వేద పండితులు గరుడ్మంతుడిని ఆహ్వానించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, దేవస్థానం ధర్మకర్తలు, అర్చకులు, రుత్వికులు, భక్తులు పాల్గొన్నారు.

శిశువు అక్రమ దత్తత కలకలం

• మూడో సంతానంలో ఆడ శిశువు • దత్తత ఇచ్చారని సమాచారంతో అధికారుల ఆరా • నల్లగొండ జిల్లాలో ఘటన

వేములపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలో శిశువు అక్రమ దత్తత కలకలం రేగింది. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న గ్రామంలో గిరిజన దంపతులు తమకు మూడో సంతానంలో కలిగిన ఆడ శిశువును అక్రమంగా దత్తత ఇచ్చారనే సమాచారం శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వేములపల్లి మండలంలోని మహిళ అక్టోబరు 6వ తేదీన మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మూడో కాన్పులో ఆడబిడ్డ జన్మించింది. ఆ గ్రామంలో రెండు, మూడో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చినవారి వివరాలను ఐసీడీఎస్ అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సదరు మహిళ ఇంట్లో లేకపోవడంతో వెనుదిరిగారు. శుక్రవారం ఇంటికి వచ్చిన ఆమెను ఐసీడీఎస్ చైల్డ్ వెల్ఫేర్ అధికారులు మరోమారు ఆరా తీశారు. తల్లి వెంట శిశువు లేకపోవటంతో ప్రశ్నించారు. ఆడ శిశువును తమ సమీప బంధువు, వరుసకు సోదరి ఇంట్లో ఉంచామని, విక్రయించలేదని బిడ్డను తామే తెచ్చుకుంటామని అధికారులకు చెప్పినట్లు సమాచారం. కాగా 25రోజుల శిశువు తల్లి ఒడిలో లేకుండా సమీప బంధువుల వద్ద ఎలా ఉంచారని సమాధానం చెప్పడంతో అధికారులకు అనుమానం వచ్చింది. ఈ విషయమై ఐసీడీఎస్ సీడీపీవోను చంద్రకళ వివరణ కోరగా శిశువు సదరు మహిళ వద్ద లేని విషయం వాస్తవమేనని, విచారించగా తమ సమీప బంధువైన సోదరి ఇంట్లో ఉందని, శనివారం తీసుకొచ్చి తామే సాదుకుంటామని చెప్పినట్లు తెలిపారు. విక్రయానికి, దత్తతకు ఇవ్వలేదని చెప్పారని పేర్కొన్నారు. శనివారం వరకు శిశువు తల్లి ఒడికి చేరకుంటే సదరు దంపతులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీడీపీవో తెలిపారు.

చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

• చాక్లెట్ ఇస్తామని అఘాయిత్యానికి యత్నం • యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఘటన

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో ఈ సంఘటన జరిగింది. చిన్నారి తల్లి, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన దంపతులు ఆరు నెలల క్రితం వలస వచ్చి స్థానిక పరిశ్రమలో పనిచేస్తూ లింగోజిగూడెం శివారులో నివాసం ఉంటున్నారు. ఈ దంపతులకు నాలుగేళ్ల కుమార్తె ఉంది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శివరాజ్(42), దినేష్(45) స్థానిక పరిశ్రమలో పని చేస్తూ చిన్నారి తల్లిదండ్రులు నివాసం ఉండే గుడిసె సమీపంలోనే ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో ఆ ఇద్దరు యువకులు చిన్నారికి చాక్లెట్ కొనిస్తామని చెప్పి తాము నివసించే గుడిసెలోకి తీసుకెళ్లారు. ఆ సమయంలో తల్లి దుస్తులు ఉతుకుతోంది. గుడిసెలోకి వెళ్లిన చిన్నారి కొద్దిసేపటి తర్వాత కేకలు వేయటంతో సమీపంలో ఉన్న ఓ మహిళ గుడిసె వద్దకు వెళ్లి చూసింది. నిందితులు చిన్నారిపై లైంగిక దాడికి యత్నిస్తుండటాన్ని గమనించి తలుపులు బాదటంతో వారు తలుపులు తెరిచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న తల్లి స్థానికులకు తెలియజేయటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అనంతరం లైంగిక దాడికి సంబంధించి పూర్తి సమాచారం కోసం చిన్నారిని హైదరాబాద్ నిలోఫర్ అసుపత్రికి తరలించారు. మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులు చిన్నారి ఆరోగ్యస్థితిని పరిశీలించారు. తల్లి నుంచి వివరాలు సేకరించారు. పోలీసులు నిందితులను అదుపులో తీసుకుకుని విచారణ చేస్తున్నారు. చిన్నారి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

నాకు న్యాయం చేయాలి..


చంటిబిడ్డతో ఆందోళన చేస్తున్న మహిళ

నకిరేకల్, అక్టోబరు 31, (ఆంధ్రజ్యోతి): తనను పెళ్లి చేసుకుని బిడ్డ పుట్టాక మరో మహిళను పెళ్లి చేసుకుని తనను ఇబ్బంది పెడుతున్న భర్తను శిక్షించాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని నెల్లిబండ గ్రామంలో భర్త ఇంటి ఎదుట చంటి బిడ్డతో శుక్రవారం ధర్నాకు దిగింది. వివరాల్లోకి వెళ్తే.. నెల్లిబండ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఓరుగంటి విష్ణు అదే గ్రామానికి చెందిన బోయిన రేణుకతో సహజీవనం చేశాడు. 10 సంవత్సరాల క్రితం చెరువుగట్టు దేవస్థానంలో పెళ్లి చేసుకున్నాడని, తమకు ఒక పాపకూడా పుట్టిందని తెలిపింది. వివాహం తర్వాత మరో మహిళను పెళ్లి చేసుకుని తనను మోసం చేశాడని ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ విష్ణు ఇంటి ఎదుట చంటిపాపతో ధర్నాకు దిగింది. విష్ణు వివాహం చేసుకున్న మహిళతో ఉంటూ తనను పట్టించుకోవడం లేదని ఆరోపించింది.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ


పూజల్లో పాల్గొన్న భక్తులు

కనగల్, అక్టోబరు 31,(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో మొక్కుబడి కళ్యాణాలు నిర్వహించి, చీరసారె ఒడిబియ్యం బోన నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ బి. సుమతి దంపతులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు శ్రవణ్‌చార్యులు, దామోదర్ రావ్ వేద ఆశీర్వచనాలు అందజేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

వేపకు మరోసారి ఆపద


రాజాపేట మండలం బొందుగులలో ఎండిపోయిన వేప చెట్టు

రాజాపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : వేపచెట్టును ఐక్యరాజ్యసమితి ఇండియన్ హెర్బల్ డాక్టర్‌గా వర్ణిస్తూ 21వ శతాబ్దపు చెట్టుగా గుర్తించింది. ఈ చెట్టు ఔషధగుణాలు కలిగి మానవాళికి ఎన్నోరకాలుగా ఉపయోగపడుతోంది. వివిధ వ్యాధుల చికిత్సకు, వ్యవసాయ రంగంలో చీడపీడల నివారణకు వేపను, వేప ఉత్పత్తులను విరివిగా వినియోగిస్తారు. యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగస్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాలున్న వేపకు మరోసారి ఆపద వచ్చిపడింది. 2019లో మొదటగా వేపకు ఫంగస్ సోకి ఎండిపోయాయి. వాతావరణంలో మార్పులతో శిలీంధ్రం ఆశించి డై బ్యాక్ వ్యాధితో(ఎండుకొమ్మ తెగులు) ఇప్పుడు మరోసారి చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. జిల్లాలోని పలు మండలాల్లో వేపచెట్లు ఎండిపోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేపను రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎండిపోతున్న వేప

రాజాపేట మండలంలో కరోనా కాలం నుంచి ఎండుకొమ్మ తెగులుతో వేపచెట్లు ఎండిపోతున్నాయి. చెట్టు చిగుర్ల నుంచి మొదలై చెట్టంతా పూర్తిగా తెగులు పాకుతోంది. మొదటగా చిగుర్లను శిలీంధ్రం ఆశించడంతో చిగుర్లు, ఆకులు పూర్తిగా మాడిపోతున్నాయి. కొద్దిరోజుల్లోనే తెగులు చెట్టంతా వ్యాపించి పూర్తిగా ఎండిపోతోంది. ఆగస్టులో తెగులు సోకడం ప్రారంభమైందని రైతులు తెలిపారు. చిన్నచిన్న వేపచెట్లే కాకుండా 20, 30 ఏళ్ల నాటి వృక్షాలు కూడా ఈ వ్యాధిన బారిన పడ్డాయి.

వేప చెట్టు ఎండిపోవడం ఎప్పుడూ చూడలే



నా వయస్సు 80 ఏళ్లు. వేపచెట్లకు తెగుళ్లు రావడం ఇప్పుడే చూస్తున్నా. వేపచెట్ల ఆకులు మాడిపోయి చెట్టంతా ఎండిపోతోంది. ప్రజలకు ఎంతో ప్రయోజనంగా ఉన్న వేపచెట్లను కాపాడాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం చర్యలు తీసుకుని వేపచెట్లను రక్షించాలి

-చింతల నర్సయ్య,గ్రామస్థుడు, బూరుగుపల్లి

ఇలా నివారించాలి



వేపచెట్లకు సోకిన డైబ్యాక్ వ్యాధిని ప్రజలందరూ కలసి నివారించాలి. లేకుంటే వేపచెట్టుకు ప్రమాదం పొంచి ఉంది. వ్యాధి సోకిన చెట్లకు మొదటి చర్యగా కార్బండిజమ్(50%డబ్ల్యుపీ) మందును లీటరు నీటికి 2 గ్రాములు కలిపి చెట్టు మొదలు పూర్తిగా తడిచేట్లుగా పోయాలి. మందు స్పర్శ ద్వారా మొదలు, వేర్లు, కాండంపై ఉన్న శిలీంధ్రాన్ని అరికడుతుంది. వారం రోజుల తర్వాత థయోఫినేట్ మిథైల్(50%డబ్ల్యుపీ) మందును లీటరు నీటికి 2 గ్రాములు కలిపి చెట్టు మొదలు పూర్తిగా తడిచేట్లుగా పోయాలి, ఈ మందు చెట్టు అంతకు వ్యాపించి శిలీంధ్రాన్ని నాశనం చేస్తుంది. 20 రోజుల తర్వాత ప్రోఫినోపాస్ మందును లీటరు నీటికి 3మిల్లీలీటర్లు కలిపి చెట్టు మొదలు తడిచేలా పోసి రక్షించుకోవాలి.

• గొల్లపల్లి పద్మజ, ఏవో, రాజాపేట

విద్యుదాఘాతంతో గేదె మృతి



మునగాల రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గేదె మృతిచెం దింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండల పరిధిలోని వెంకట్రాంపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు దొంగరి గోవర్ధన్ తన గేదెలను శుక్రవారం మేత కోసం పొలానికి తోలుకెళ్లాడు. ఇటీవల కురిసిన గాలులు, వర్షాలతో అక్కడ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఈ క్రమంలో అక్కడ మేత మేస్తున్న గేదె విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది.

గూడు కోసం యాతన

• సీఎస్ఆర్ కింద ఇప్పిస్తామని అధికారుల హామీ • సిమెంట్ లేక ఆగిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం



ఉచిత సిమెంట్ కోసం దివ్యాంగ దంపతులు యాతన పడుతున్నారు. తమకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సీఎస్ఆర్ (సామాజిక బాధ్యత) కింద సిమెంట్ ఇప్పించాలని కోరుతూ అధికారులు, ప్రజాప్రతినిధులను కలిశారు. ఎక్కడా వారికి ఆశించిన స్పందన రాలేదు. ప్రజావాణిలో దరఖాస్తు పెట్టుకోగా ఇప్పిస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారు. సిమెంట్ కొనలేక ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు నిలిచిపోయాయని బాధిత లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

• (ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలుకు చెందిన మధుభూషణ్. రజనీలు దివ్యాంగ దంపతులు. వీరికి ఇందిరమ్మ ఇల్లు పథకంలో మొదటి విడత దివ్యాంగుల కోటాలో రజనీ పేరిట ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. అయితే తాము పేద కుటుంబానికి చెందిన వారమని సిమెంట్ కొనే స్థితిలో కూడా లేమని ఎవరైనా దాతల ద్వారా ఉచిత సిమెంట్ ఇప్పించాలని వేడుకుంటూ రాష్ట్ర దివ్యాంగుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితారామచంద్రన్‌కు లేఖద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ లేఖపై స్పందించిన ఆమె దివ్యాంగ దంపతుల ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గాను సీఎస్ఆర్ కింద సిమెంట్ ఇచ్చేలా సహకరించాలని కోరారు. దీంతో ప్రిన్సిపల్ సెక్రటరీ విజ్ఞప్తి మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి రజనీ కుటుంబ ఆర్థికపరిస్థితిని వివరిస్తూ సీఎస్ఆర్ కింద సిమెంట్ బస్తాలు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని పెద్దదేవులపల్లిలోని రెడ్డీ ల్యాబ్స్ యాజమాన్యాన్ని ఈ నెల 6న లేఖ ద్వారా తెలిపారు. మధుభూషణ్‌కు సీఎస్ఆర్ కింద సిమెంట్ ఇప్పించడంలో చొరవ చూపాలని కోరుతూ కలెక్టర్ సూచన మేరకు నల్లగొండ ఆర్డీవో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌కు లేఖ రాశారు.

మంత్రి అడ్లూరి, చిన్నారెడ్డిని కలిసినా..

ఉచిత సిమెంట్ ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని కలెక్టర్ చేసిన విజ్ఞప్తిపై సంబంధిత అధికారుల నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు రాష్ట్ర ప్రణాళిక సంఘం చైర్మన్ జీ.చిన్నారెడ్డిని రజనీ భర్త మధుభూషణ్ కలిసి తన పరిస్థితిని వివరించారు. దీంతో దివ్యాంగుల దంపతులకు ఉచిత సిమెంట్ ఇచ్చే అవకాశాలను పరిశీలించాలని సూచిస్తూ వారు కూడా కలెక్టర్‌కే లేఖ రాయడంతో కథ మళ్లీ కలెక్టర్ వద్దకే చేరింది. అధికారుల చుట్టూ తిరిగి ఇబ్బంది పడుతున్నామని అసలు ఉచిత సిమెంట్ ఇస్తారో....ఇవ్వరో చెప్పడం లేదని కాలయాపన జరుగుతోందని ఇంటి నిర్మాణం కూడా మధ్యలోనే ఆగిపోయిందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మొదటి విడత రూ.లక్ష మాత్రం తమ ఖాతాలో జమయ్యాయని తెలిపారు. అధికారుల తీరుపై విసుగు చెందిన మధుభూషణ్ 'ప్రజావాణి' సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయం మెట్లపై కూర్చుని నిరసన తెలిపారు. సిమెంట్ కొనలేక ఇందిరమ్మ ఇంటి నిర్మాణం నిలిచిందని ఆవేదన వ్యక్తం చేశాడు.


పిల్లర్‌ల వరకే నిలిచిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

40 బస్తాల సిమెంట్‌కు విశ్రాంత ఉద్యోగి విరాళం

రజనీ, మధుభూషణ్ దివ్యాంగ దంపతులు ఉచిత సిమెంట్ కోసం ఓ దాత ముందుకు వచ్చారు. ప్రజాభవన్‌లో ప్రణాళిక సంఘం చైర్మన్ చిన్నారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిన విషయాన్ని తెలుసుకున్న రామంతాపూర్ లాల్‌కోటకు చెందిన విశ్రాంత ఎండోమెంట్ జాయింట్ కమిషనర్ రజనీ ఇంటి నిర్మాణం కోసం 40 బస్తాల సిమెంట్ కోసం కావాల్సిన డబ్బులను విరాళంగా పంపించారు.

సమాజానికి మనోవైజ్ఞానికుల అవసరం ఉంది

● ఎంజీయూ ఉపకులపతి అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సంక్లిష్టతల సమాజానికి మనోవైజ్ఞానికుల అవసరం ఎంతైనా ఉందని ఎంజీయూ ఉపకులపతి ఆచార్య అల్తాఫ్‌హుస్సేన్ అన్నారు. ఎంజీయూలో సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబొరేటరీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వయోవృద్ధుల్లో నానాటికి పెరుగుతున్న కుంగుపాటు, నిరుత్సాహం, యువత, పిల్లల్లో మొబైల్ వినియోగం వంటి వ్యసనాలకు సైతం మనోవైజ్ఞానికులు దిక్సూచిగా నిలవాలన్నారు. బాల్యం, ఒడిదుడుకుల యవ్వనం, కుంగుపాటుల వృద్ధాప్యం, వలస బతుకులు వంటి సమకాలిన అంశాలను క్షుణ్ణంగా పరిశోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అరుణప్రియ, అంజిరెడ్డి, ఆకుల రవి, అరవింద్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

చెర్వుగట్టు ఆలయ ఈవోగా మోహన్‌బాబు


మోహన్‌బాబు

నార్కట్‌పల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలోని అతిపెద్ద పుణ్యక్షేత్రం నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో గల ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఈవో (అదనపు బాధ్యతలు)గా మోహన్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా వేములకొండ మత్స్యగిరి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న మోహన్‌బాబుకు చెర్వుగట్టు అదనపు బాధ్యతలు ఇస్తూ దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఇటీవలే ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు పెద్దపీట వేస్తూ క్షేత్ర ప్రాశస్త్యం పెరిగేలా, అభివృద్ధి జరిగేలా తన వంతు కృషి చేస్తానని భక్తులు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

మూసీకి కొనసాగుతున్న వరద ఉధృతి

● 12 వేల క్యూసెక్కుల వరద నీటి విడుదల

● సూర్యాపేట-మిర్యాలగూడెం రూట్‌లో బస్సు సర్వీసుల పునరుద్ధరణ


మూసీ 5 క్రస్టు గేట్లు ఎత్తడంతో దిగువకు భారీగా వెళుతున్న వరద నీరు

కేతేపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతుంది. మొంథా తుపాను ధాటికి వచ్చిన వరదలతో పొంగిపొర్లిన మూసీ ప్రాజెక్టు కాస్త నెమ్మదించింది. శుక్రవారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 10825.51 క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోకు అనుగుణంగా అధికారులు ప్రాజెక్టు ఐదు క్రస్టుగేట్లను 3 అడుగుల మేర ఎత్తి 12833.55 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.30అడుగులు(4.02టీఎంసీలు)గా ఉంది.

బస్సు సర్వీసుల పునరుద్ధరణ

మూసీ ప్రాజెక్టు నుంచి వరద నీటి విడుదల తగ్గడంతో సూర్యాపేట-మిర్యాలగూడెం పట్టణాల మధ్య భీమారం మీదుగా గల రహదారిపై శుక్రవారం వాహనాల రాకపోకలు సాగాయి. మూసీ ప్రాజెక్టు నుంచి 40 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు విడుదల కావడంతో గురువారం రాత్రి వరకు ఈ రూట్‌లో భీమారం వద్ద గల లోలెవల్ కాజ్‌వే మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో రాకపోకలను నిలిపి వేశారు. వరద ఉధృతి తగ్గడంతో శుక్రవారం ఉదయం నుంచి ఈ మార్గంలో అన్ని రకాల వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి.

శరవేగంగా మరమ్మతులు

● జాతీయ రహదారిపై రాకపోకల పునరుద్ధరణకు చర్యలు


హైవేపై ఏర్పడిన గండిని యంత్రాలతో పూడుస్తున్న అధికారులు

డిండి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వరద తాకిడికి జాతీయ రహదారి 765పై కోతకు గురైన ప్రాంతంలో మట్టితో పూడుస్తున్నారు. రెండు రోజులుగా యంత్రాల సహాయంతో కోతకు గురైన ప్రాంతాన్ని మట్టితో నింపి రాకపోకలు పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. డిండి ప్రాజెక్టు వియర్ నుంచి వచ్చే వరద దాటికి శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారి కోతకు గురైంది. దీంతో హైవేపై రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాల రాకపోకలను పునరుద్ధరించేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఒకటి, రెండు రోజులలో మరమ్మతులు పూర్తవుతాయని సంబంధిత అధికారులు తెలిపారు.

అంతర్జాతీయ వీల్‌చైర్ బాస్కెట్ బాల్ పోటీలకు సురేష్


సురేష్

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీలకు రంగుండ్ల తండాకు చెందిన ధరావత్ సురేష్ ఎంపికయ్యారు. నవంబరు 4 నుంచి 16వ తేదీ వరకు థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో నిర్వహించే ఆసియా ఓషేనియా జోన్(ఏవోజెడ్) వీల్ చైర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ -2025లో ఆయన పాల్గొననున్నాడు. ప్రపంచంలోని 15 దేశాల జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయి. ఈ టోర్నీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పారా ఒలంపిక్స్‌కు ఎంపిక చేయనున్నారు. అయితే సురేష్ కొన్నేళ్లుగా రాష్ట్ర, జాతీయ స్థాయి వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ తెలంగాణ రాష్ట్రం నుంచి భారత జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మారుమూలతండా నుంచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై సురేష్ తల్లిదండ్రులు, తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

హోరాహోరీగా జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నల్లగొండ ఆధ్వర్యంలో శుక్రవారం 69వ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ అండర్ -14 బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ దగ్గుబాటి విమల, డీవైఎస్‌వో అక్బర్ అలీ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి బాలబాలికలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంపిక పోటీలు సాగాయి. గెలుపొందిన క్రీడాకారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బొమ్మపాల గిరి, ప్రణీత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వరి.. బంగారు సిరి..!

హైదరాబాద్‌కు చేరువలో ఉన్న యాదాద్రి-భువనగిరి జిల్లాలోని మూసీ ఆయకట్టు పరిధిలో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వరి పంట కోతలకు రావడంతో శుక్రవారం సాయంత్రం సూర్యుడి కాంతి కిరణాలు వరి చేలపై పడి సువర్ణ శోభితమై చూపరులను వరి చేలు హరిత సువర్ణంలో కనువిందు చేస్తోంది. భూ దాన్ పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని వరిచేలు ప్రజలను కనువిందు చేస్తున్న దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం క్లిక్ మనిపించింది.

- భూదాన్‌పోచంపల్లి, ఆంధ్రజ్యోతి

వైభవంగా సువర్ణ పుష్పార్చన, ఊంజల్ సేవోత్సవాలు


తిరువీధి సేవ నిర్వహిస్తున్న అధికారులు, అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన అండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదా య రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని శ్రీ రామలింగేశ్వరస్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహో మం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 17,82,669 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో ఎస్.హరీష్ తెలిపారు. కొండకింద వ్రత మండపాల్లో సత్యదేవుని వ్రతాలు 296 జంటలు నిర్వహించారు.

సంప్రదాయబద్ధంగా శ్రీలక్ష్మీనరసింహుని కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుని క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్యాకల్యాణం వేద పండితులు సంప్రదాయబద్ధంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ స్వామి, రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు శ్రీనివాసచార్యులు, రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి పాల్గొన్నారు.

ఈసారైనా మెరుగుపడేనా?

(5వ పేజీ తరువాయి)

నుంచి ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గంట వరకు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. అందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. డిసెంబరు నెలాఖరు వరకు సిలబస్‌ను పూర్తిచేయనున్నారు. తర్వాత విద్యార్థులకు స్లిప్‌టెస్టులు నిర్వహించి వెనకబడిన వారిని గుర్తించి ప్రత్యేక బోధన చేయనున్నారు. జనవరి నుంచి సిలబస్‌ను రివిజన్ చేయించనున్నారు. ఇప్పటికే విద్యార్థులకు యూనిట్ టెస్టులు నిర్వహిస్తున్నారు. వాటి ఫలితాల ఆధారంగా విద్యార్థుల స్థాయిని గుర్తిస్తున్నారు.

సరిపడా అధ్యాపకులు

సూర్యాపేట, యాదాద్రి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు విద్యాబోధన చేసేందుకు అవసరమైన అధ్యాపకులు పూర్తి స్థాయిలో ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో అన్ని సబ్జెక్టులకు సంబంధించి 168 మంది అధ్యాపకులు అవసరం కాగా, రెగ్యులర్ అధ్యాపకులు 140 మంది ఉండగా, మిగిలిన 28 మందిని గెస్ట్ లెక్చరర్స్‌గా తీసుకున్నారు. అదే విధంగా యాదాద్రి జిల్లాలో 204 మంది అధ్యాపక పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం రెగ్యులర్ అధ్యాపకులు 121 మంది ఉండగా, 39 మందిని గెస్ట్ లెక్చరర్లుగా తీసుకున్నారు. ఇంకా 44 మంది అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మెరుగైన ఫలితాల సాధన కోసం...



ఇంటర్‌లో ఈసారి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధన కోసం కృషి చేస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతం కంటే ఈ ఏడాది వార్షిక పరీక్షల్లో వంద శాతం నాణ్యమైన ఫలితాలు రాబట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే ప్రత్యేక అదనపు తరగతులు ప్రారంభించాం. ఫేక్ రికగ్నైజేషన్ సిస్టమ్ ద్వారా విద్యార్థుల హాజరు నమోదు చేయడంతో హాజరు శాతం పెరిగింది. కళాశాలలకు రానీ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని రప్పించేలా చర్యలు చేపడుతున్నాం.

- భానునాయక్, డీఐఈవో సూర్యాపేట

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

● సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోద శ్రీరాములు


ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 31, (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర సమితి స భ్యుడు గోద శ్రీరాములు అన్నారు. శక్రవారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఐ కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహించి వారికి అండగా నిలిచింది ఏఐటీయూసీ ఒక్కటేనాన్నరు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్, బండి జంగమ్మ, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, మునిసిపాలిటి సీపీఐ పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, నాయకులు పెంటయ్య, గోపగాని రాజు, పెంటయ్య పాల్గొన్నారు.

మోత్కూరు: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది ఏఐటీయూసీయేనని సీపీఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్ అన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మోత్కూరులో ఏఐటీయూసీ సివిల్ సప్లైస్ హమాలీ యూనియన్, సీపీఐ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి జంగ నర్సయ్య, హమాలీ యూనియన్ అధ్యక్షుడు పురుగుల రవి, సీపీఐ పట్టణ కార్యదర్శి బోయిని ఉప్పలయ్య, గొలుసుల యాదగిరి, పంగ వెంకన్న, జీడయ్య పాల్గొన్నారు.

నాంపల్లిలో చేపల చెరువులకు గండ్లు

● వరద నీటికి కొట్టుకుపోయిన చేపలు

● పంట పొలాల్లోకి రావడంతో వలలతో పట్టుకున్న గ్రామస్థులు


వరద నీరు పొలాలు, రోడ్లపైకి చేరడంతో వరదను కొట్టుకువచ్చిన చేపలను పట్టుకుంటున్న గ్రామస్థులు

నాంపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు చేపల చెరువులు గండ్లు పడ్డాయి. వరద ప్రవాహం పెరగడంతో చెరువులలో చేపలు వరదనీటికి కొట్టుకుపోయాయి. మండలంలోని రెవల్లి, పసునూరు, కేతేపల్లి, నాంపల్లి చెరువుల్లో చేప పిల్లలను పోశారు. నాంపల్లి, రెవెల్లి చె రువులలోని చేపలు ఎదుగుదలకు వచ్చే సమయంలోనే వర్షాలు రావడం, చెరువులలోకి భారీ వర్షపునీరు చేరడంతో చెరువులో నీ రు దిగువకు వెళ్లింది. దీంతో దీంతో చేపలు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. దీంతో తీవ్రంగా నష్టపోయామని మత్స్యకారు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలు, రోడ్లపైకి వర్షపునీటిలో చేపలు కొట్టుకురావడంతో ఆయా గ్రామాల ప్రజలు వలలు వేసి చేపలను పట్టుకోవడం కనిపించింది.

చట్టవిరుద్ధమైన దత్తత శిక్షార్హం

● జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి

నార్కట్‌పల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): చట్టవిరుద్ధమైన చిన్నారుల దత్తత శిక్షార్హమని జిల్లా సంక్షేమ శాఖ అధికారి(డీబ్ల్యూవో) కృష్ణవేణి అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మాని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. చట్టవిరుద్ధమైన దత్తత, స్త్రీలు, మైనర్ బాలికలపై అత్యాచారాలు, అక్రమ శిశు రవాణా, బాల్య వివాహాలు వంటి అంశాలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. చట్ట విరుద్ధంగా దత్తత ఇచ్చిన వారికి దత్తత తీసుకున్న వారికి 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ పాల్గొన్నారు.


నెమ్మానిలో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న కృష్ణవేణి

కేఎన్‌ఎం ప్రభుత్వ

డిగ్రీ కళాశాలకు జిజ్ఞాస పురస్కారం


పురస్కారం అందుకుంటున్న కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జిజ్ఞాస పురస్కారం అందుకుంది. కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఆధ్వర్యంలో గణిత విభాగంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో కళాశాల సత్తా చాటింది. జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుతో రాష్ట్ర నలుమూలలకు చెందిన విద్యార్థులు పోటీపడగా, కేఎన్‌ఎం కళాశాల రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. గణిత విభాగంలో నూతన ఒరవడి సృష్టిస్తుండగా ' ఏ రోల్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఇన్ ఆర్టిఫీసియల్ ఇంటలిజెన్స్' అనే అంశంపై కళాశాల మ్యాథ్స్ లెక్చరర్ నాగరేఖారాణి మార్గదర్శనంలో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు జిజ్ఞాస పురస్కారం అందుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మల్గిరెడ్డి బీమార్జున్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ దేవసేన చేతులమీదుగా పురస్కారం అందుకోవడం ఆదర్శనీయమన్నారు. సమష్టి కృషితో కళాశాల అన్ని విభాగాల్లో అద్భుత ప్రతిభ కనపరుస్తోందన్నారు. ప్రాజెక్టు రూపకల్పనలో భాగస్వామ్యులైన అధ్యాపకులు, విద్యార్థులు నగదు ప్రోత్సాహం, మెరిట్ సర్టిఫికేట్లు అందుకున్నారని తెలిపారు. అనంతరం కళాశాల మ్యాథ్స్ విభాగాన్ని, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో లెక్చరర్లు త్రాసు వెంకటరమణ, డాక్టర్ నరేష్ గుమ్మడి, రవీందర్, విద్యార్థులు శ్రీహరి, యాస్మిన్, శివప్రసాద్, శ్రీకావ్యరెడ్డి, భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఎల్ ల్యాబ్ డైరెక్టర్‌గా రాజాపేట వాసి


అంకతి రాజు


రాజాపేట, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రానికి చెందిన అంకతి రాజు డీఆర్‌డీఎల్ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబ్) డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఇంతకు ముందు పూణేలో ఆర్మమెంట్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్ డైరెక్టర్‌గా పనిచేశారు. పదోన్నతి పొందిన రాజును శుక్రవారం మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

సొంతింటి కల నెరవేరక ముందే మృత్యు ఒడికి

● విద్యుదాఘాతంతో ఒకరి మృతి


ఎండీ.కరీం (ఫైల్)

మోటకొండూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సొంతింటి కల నెరవేరకముందే ఆ ఇంటి యజమాన్ని కన్నుమూశాడు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం నాంచారిపేట గ్రామానికి చెందిన ఎండీ.కరీం (48) తనకు మంజూరైన ఇందిరమ్మ ఇంట్లో విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కరీం ముత్తిరెడ్డిగూడెంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటి నుంచో సొంతిళ్లు నిర్మించుకోవాలనే ఆశ ఉండేది. ఆయనకు ఇందిరమ్మ మంజూరవడంతో ఇంటి నిర్మాణం మొదలుపెట్టాడు. నూతనంగా నిర్మిస్తున్న ఇంట్లో విద్యుత్ సరఫరా కాకపోవడంతో మరమ్మతు పనులు చేపడుతుండగా విద్యుదాఘాతానికి గురైయ్యాడు. గమనించిన అతని కుమార్తె అప్రమత్తతతో విద్యుత్ తీగలను తొలగించినా అప్పటికే ఆయన స్పృహ కోల్పోయాడు. వెంటనే కుటుంబసభ్యులు భువనగిరిలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. గ్రామంలో మొదటి ఇంటిని తాను పూర్తి చేసి గృహ ప్రవేశం చేయాలని కరీం చెప్పేవాడని స్నేహితులు గుర్తు చేశారు. కరీంకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కరీం భార్య సబియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.



చిత్తలూరులో లోతు కుంట చెరువుకు గండి

శాలిగౌరారం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామసమీపంలోని లోతుకుంట చెరువుకు గండి పడింది. కట్ట బలహీనంగా ఉండటం గండి పడింది. దీంతో చెరువు ఆయకట్టులోని దాదాపు 50ఎకరాల్లో వరి మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లోతుకుంట చెరువు కట్టకు విపరీతమైన కంప చెట్లు పెరగడం వల్ల కట్టకు గండిపడిందని రైతులు చెబుతున్నారు.

ఇగ్నో జాయింట్ సెక్రటరీగా లింగస్వామి



చిట్యాల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఇగ్నో) జాయింట్ సెక్రటరీగా చిట్యాల మండలం తాళ్లవెల్లంల గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కొండె లింగస్వామి ఎన్నికయ్యారు. అలాగే మండలంలోని వెల్మినేడు గ్రామానికి చెందిన వీరమల్ల శ్రీశైలం ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా పుల్లయ్య



పుల్లయ్య

కట్టంగూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుఅన్నారం ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న చింతకాయల పుల్లయ్యను పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆ సంఘం మండలశాఖ అధ్యక్షుడు నిమ్మనగోటి వెంకటరమణ శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ సంఘాల కతీతంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పుల్లయ్యను ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, ఎంఈవో అంబటి అంజయ్య, సూపరింటెండెంట్ చలపతి, కడియం రాంమోహన్, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నరేష్ ఘనంగా సన్మానించారు.

ఆ ఊరికి వెళ్లేదెలా?

- బండమీదిగూడెం వెళ్లాలంటే బాధలు తప్పవు
- ధ్వంసమైన రోడ్డు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నడుస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



వరద నీటిలో తెగిపోయిన రోడ్డులో ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని వెళ్తున్న బండమీదిగూడెం ప్రజలు

శాలిగౌరారం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి ఈ గ్రామానికి పక్కా రోడ్డు సౌకర్యం లేదు.ఉన్న గుంతల మట్టి రోడ్డు మీద నుంచి వీరి ప్రయాణం ఉంటుంది. ఈ మట్టి ఇటీవల కురిసిన వర్షాలకు వరద వచ్చి దాదాపు అర కిలోమీటరు రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఆ గ్రామస్థులు ఇతర గ్రామాలతో పాటు మండల కేంద్రం వెళ్లాలంటే రోడ్డు మార్గమే కరువైంది. అదే శాలిగౌరారం మండలం ఊట్కూరు సమీపంలోని బండమీదిగూడెం. ఊట్కూరు నుంచి కిలోమీటరన్నర దూరం బండమీదిగూడెం ఉంటుంది. ఈ కిలోమీటరన్నర రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రయాణానికి ప్రాణ సంకటంగా మారింది. మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ గ్రామానికి వెళ్లే రోడ్డు వరద నీటిలో కొట్టుకుపోయింది. ఉన్న రోడ్డు మీది నుంచి కూడా వరద నీరు వెళ్లడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామానికి ఇతర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తప్పనిసరి పరిస్థితిలో వెళ్లే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నారు. సంబంధిత పంచాయతీరాజ్ విభాగం అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ రోడ్డు పరిస్థితిని కూడా చూడటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేసి అనంతరం పక్కా రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. అలాగే మండలంలో గురజాల నుంచి రామాంజపురం, అమ్మనబోలు వరకు, వంగమర్తి నుంచి గురజాల వరకు శాలిగౌరారం నుంచి అమ్మనబోలు వరకు ఉన్న రోడ్లు కూడా అధ్వానంగా మారి ప్రయాణం ప్రాణసంకటంగా మిగిలాయి. ఈ రోడ్లను కూడా పక్కా రోడ్లుగా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పక్కా రోడ్డు నిర్మించి మా బాధలు తీర్చాలి



మా గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే పక్కా రోడ్డు లేక ఏళ్ల తరబడి అనేక అవస్థలు పడుతున్నాం. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్డు కూడా వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. అత్యవసర పరిస్థితిలో పక్క గ్రామాలకు వెళ్లాలంటే వరద నీటిలో బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తుంది. ప్రస్తుతం ఇతర గ్రామాలకు వెళ్లాలంటే వేరే మార్గమే లేదు. వెంటనే ఎంపీ, ఎమ్మెల్యే మా గ్రామ రోడ్డు పరిస్థితి చూసి పక్కా రోడ్డు నిర్మించాలి.

- శంకర్ రెడ్డి బండమీదిగూడెం, శాలిగౌరారం



తెగిపోయిన ఊట్కూరు నుంచి బండమీదిగూడెం వెళ్లే రోడ్డు

ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం అందించాలి



కొండకిందిగూడెంలో వర్షం నీటిలో మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కేతేపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను దెబ్బకు వరి, పత్తి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల చొప్పున ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం సీపీఎం నాయకుల బృందం వర్షానికి దెబ్బతిన్న వరి, పత్తి పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొంథా తుఫానుతో వచ్చిన వర్షాలకు కోతకు వచ్చిన అనేక మంది రైతుల వరి పంట నీట మునిగిపోయిందని తెలిపారు. అలాగే చేతికి వచ్చే దశలో పత్తి పంట వర్షానికి పత్తి చెట్లపైనే తడిసి ముద్దయిపోయి నల్లబారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపు దెబ్బలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు అల్లి ప్రభాకర్, వంగూరి వెంకన్న, పి.కేశవులు, జి.పుల్లమ్మ, జి.వెంకన్న, మల్లయ్య, కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమితి అధ్యక్షుడు మద్ది శ్రీనివాస్‌యాదవ్

నల్లగొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో నవంబరు 2వ తేదీన నిర్వహించే యాదవుల సదరు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని యాదవుల సదర్ ఉత్సవ సమితి అధ్యక్షుడు మద్ది శ్రీనివాస్ యాదవ్ కోరారు. పట్టణంలోని యాదవ సంఘం భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సదర్ సమ్మేళన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. హర్యానా నుంచి తెప్పిస్తున్న పద్మశ్రీ అవార్డు గెలుచుకున్న గోల్డ్ భజరంగి, షెహన్‌షా కోహినూర్ దున్నరాజుల ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయని తెలిపారు. కులమతాలు, పార్టీలతీతంగా అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యాదవ సంఘం నాయకులు పంకజ్ యాదవ్, లింగయ్యయాదవ్, ముచ్చర్ల ఏడుకొండల్, పిల్లి రామరాజుయాదవ్, అల్లి సుభాష్‌యాదవ్, అల్లి చంద్రయ్య, కోటేష్, నాగరాజు, శివకుమార్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత కోసం కృషి చేయాలి



బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్‌ఫర్ యూనిటీలో పాల్గొన్న నాయకులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

జాతీయ సమైక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, ఏకతా దివస్ సందర్భంగా శుక్రవారం జిల్లాలో రన్ ఫర్ యూనిటీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ దేశంలో ఎన్ని మతాలు, కులాలు, భాషలు ఉన్నా భారతీయులమంతా ఒక్కటేనన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిజాం రాజు మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని స్వతంత్ర భారత దేశంలో విలీనం చేయించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. నేటి యువత, విద్యార్థులు సర్దార్ వల్లబాయి పటేల్ స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. రన్‌ఫర్ యూనిటీకి అనూహ్య స్పందన లభించింది. పలు పాఠశాలల విద్యార్థులు, యువకులు స్వ చ్ఛందంగా పాల్గొన్నారు.

నల్లగొండ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, పిల్లి రామరాజు, పోతేపాక లింగస్వామి, మండల వెంకన్న, మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మిర్యాల వెంకటేశం, మహేష్, నరేందర్‌రెడ్డి, శాంతిస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడబోయిన శ్రీనివాస్, బిల్లకంటి శ్రీకాంత్, మునుకుంట్ల గణేష్, నేముల నాగరాజు, వడ్డేపల్లి రామలింగం, పార్థసారథి, శివ పాల్గొన్నారు.

చిట్యాలలో ఎస్ఐ మామిడి రవికుమార్ రన్ ఫర్ యూనిటీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఏ వెంకన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కట్టంగూరులో ఎస్ఐ రవీందర్ ప్రారంభించిన కార్యక్రమంలో ఎంఈవో అంబటి అంజయ్య, ఉపాధ్యాయులు మహ్మద్ గఫూర్, ఆంథోని, శ్రీనివాస్‌రెడ్డి, విఠల్, ఏఎస్ఐ శ్రీనివాస్, సత్యనారాయణ, సతీష్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో ఎస్ఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ నిర్వహించారు.

శాలిగౌరారంలో ఎస్ఐ శాలిగౌరారం సైదులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువత, విద్యార్థులు రాజకీయ నాయకులు, పోలీసులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జమ్ము రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు అయితగోని గణేష్‌గౌడ్, బోడరాజు, రాచమల్ల శ్రీను, సందీప్, ఉమేష్, వీరేందర్, యాదగిరి పాల్గొన్నారు.

నాంపల్లిలో ఎస్ఐ కె.లింగారెడ్డి ప్రారంభించిన కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జున్‌రావు, హెచ్ఎం అజయ్, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

చండూరులో సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ వెంకన్న మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత కోసం యువత పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో డాన్‌బోస్కో కళాశాల ప్రిన్సిపాల్, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనగల్‌లో ఎస్ఐ రాజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, గడ్డం అనూప్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యుడు కూసుకుంట్ల రాజురెడ్డి, గోగు యాదయ్య, పగిటిపాటి సత్తయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ థామసయ్య, హెడ్‌కానిస్టేబుళ్లు రషీద్‌ఖాన్ వీరయ్య, రాజు పీసీలు రవీందర్‌రెడ్డి, వెంకన్న, జెబీషాలినీ, లింగరాజు, మోహన్ పాల్గొన్నారు.

మర్రిగూడలో ఎస్ఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి చౌరస్తా వరకు జాతీయ ఐక్యత దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మున్నయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో బిట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాంభవీదేవికి ఘనంగా భక్తుల పూజలు

చిట్యాలరూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కార్తీకశుక్రవారాన్ని పురస్కరించుకుని చిట్యాల మండలం నేరడలోని శ్రీమహమ్మాయి శాంభవీదేవీ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. హైదరాబాద్‌లోని షాద్‌నగర్‌కు చెందిన దాసోజు రామమూర్తి-పూలమణిలు అభిషేక కార్యక్రమాలను నిర్వహించి పూజలో పాల్గొన్నారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. పురోహితులు అమ్మవారికి పూజా కార్యక్రమాలను అభిషేకాల అనంతరం పూజలను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారి దర్శించుకోవడంతో ఆలయాల్లో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది.



శాంభవీదేవీ అమ్మవారు



పేదల జీవితాల్లో వెలుగు నింపిన ఇందిరమ్మ

- కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి



ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల జాతీయం, 20 సూత్రాల పథకం, అనేక సంక్షేమ పథకాలు, పేదల జీవితాలల్లో వెలుగులు నింపిన ఘనత స్వర్గీయ ఇందిరాగాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందిరాగాంధీ ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశానికి హరిత విప్లవాన్ని తీసుకువచ్చిన ఘనత స్వర్గీయ ఇందిరాగాంధీకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు మందడి శ్రీనివాస్‌రెడ్డి, జూలకంటి శ్రీనివాస్, కత్తుల కోటి, బొజ్జ శంకర్, బొజ్జ రమేష్, వెంకన్న, మామిడి కార్తీక్, గోపాల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: శాలిగౌరారంలో భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేష్, మాజీ ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్, నాయకులు కడారి అంజయ్య, బోడ విజయకుమార్, పెరుమాండ్ల నరేష్, వేముల భరత్, కంది మహేష్, చిల్లంశెట్టి సాయి గణేష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు: గరీబీ హఠావో నినాదంతో దేశంలో పేదల ఆకలి తీర్చిన ఘనత స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీకే దక్కుతుందని చండూరు మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. పట్టణంలో ఆమె విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లగంటి మల్లేశం, కల్లెట్ల మారయ్య, జనార్దన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మర్రిగూడ: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఇందిరాగాంధీ అని డీసీసీ ఉపాధ్యక్షుడు మేకల జగన్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఆదివాసీ కమిటీవర్గ సభ్యుడు రమావత్ శ్రీనివాస్‌నాయక్, మాల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నక్క తిరుపతయ్య, వెంకటపేట బాలయ్య, బండి హనుమంత్, మెండు నరసింహారెడ్డి, అల్వాల్ రెడ్డి, బిచ్చనాయక్, వెంకట్‌రెడ్డి, అజిత్‌రెడ్డి, వెంకటాచారి, శ్రీనివాస్‌గౌడ్, గ్యార వెంకట్, శ్రీనివాసులు, వెంకటాచారి ఉన్నారు.



శిశు విక్రయాలు జరిగితే కఠినచర్యలు

- ఐసీడీఎస్ సీడీపీవో లావణ్యకుమారి



సమావేశంలో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీవో లావణ్యకుమారి

చిట్యాలరూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా శిశు విక్రయాలు జరిగితే చట్టపరంగా కఠినచర్యలు ఉంటాయని ఐసీడీఎస్ సీడీపీవో లావణ్యకుమారి హెచ్చరించారు. చిట్యాల మండలం వెలిమినేడులో శుక్రవారం నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్ల సెక్టార్ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. శిశు విక్రయాలు నేరమని వాటిపై దృష్టిని సారించాలని సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శిశు విక్రయాలు, అక్రమ దత్తత తీసుకోకూడదని, దత్తత చట్ట చట్టపరంగా తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేయకూడదని, ఆడపిల్లలకు వివాహ వయస్సు వచ్చిన తర్వాతే చేయాలని సూచించారు. గర్భిణుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఏసీడీపీవో వెంకటమ్మ, సూపర్‌వైజర్ నాగమణి, టీచర్లు, సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

నల్లగొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకోవాలని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పంట నష్టంపై పూర్తిస్థాయిలో అంచనా వేసి రైతులందరికీ పరిహారం రైతు ఖాతాలో జమ చేయాలని పేర్కొన్నారు. పంట చేతికి అందే సమయంలో వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు.


ఆర్థిక సహాయం

మర్రిగూడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన రాజు యాదమ్మ, మహమ్మద్ జమిందార్ ఫాతిమా ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను శివన్నగూడ నీలకంఠ రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రాపోలు యాదగిరి శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఇద్దరి కుటుంబాలకు చెరో రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.0

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శనివారం 1 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.80 (311.4474)	88,650	88,650
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.30 (4.02)	10,825.51	12,979.48
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.618 (40.6787)	84,370	98,285

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



ధాన్యం కొనుగోళ్లు నిలిచాయి

- తాత్కాలికంగా నిలిపివేసిన ప్రభుత్వరంగ సంస్థలు
- ఆరబెట్టిన తరువాతే ధాన్యం, పత్తి కొనుగోళ్లు
- ఇప్పటి వరకు వరి 49వేల మెట్రిక్ టన్నులు, పత్తి 900 క్వింటాళ్ల కొనుగోలు

ఆడపాదడపా కురిసిన వర్షాలకు తోడు మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రైతులకు నష్టం మిగిలింది. తుఫాన్‌తో ధాన్యం, పత్తి తడవడంతో ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోళ్ల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశాయి. ధాన్యం, పత్తిని ఆరబెట్టి న తరువాతే కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

తేమతో సంబంధం లేకుండా తడిసిన ధాన్యం, పత్తి కొనుగోళ్లను సేకరించాలనే డిమాండ్‌పై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాకపోవడంతో ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేయడం లేదు. మొంథా తుఫాన్ ప్రభావంతో పాటు ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలతో జిల్లాలో 61వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. అదేవిధంగా నూర్పిడి చేసిన 4,800 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసింది. దాదాపు 180 ధాన్యం రాశులు నీటిలో కొట్టుకుపోయాయి. చాలా చోట్ల ధాన్యం మొలకెత్తుతుండగా, పత్తి పింజ తడిసి ముద్దయి నల్లబారుతోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చే ముందు చేజారిపోవడంతో వారికి కంటి మీద కునుకు లేకుండాపోయింది. జిల్లాలో మూడు రోజుల పాటు కురిసిన అకాల వర్షాలు, తుఫాన్ ప్రభావంతో రైతులు నష్టపోయారు. ఒక్కో రైతు పెట్టుబడులు పెట్టి పంట విక్రయించే సమయంలో వర్షాలు నిండా ముంచాయి.


మందకొడిగా సీసీఐ పత్తి కొనుగోళ్లు

జిల్లాలో ఈనెల 24వ తేదీ నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభించింది. సీసీఐ కొనుగోళ్లు చేపట్టిన రోజు నుంచి తరచూ వర్షాలు వెంటాడుతున్నాయి. జిల్లాలో 23 జిన్నింగ్ మిల్లు ఉన్నాయి. తొమ్మిది ఎల్-1 జిన్నింగ్ మిల్లుల్లో అధికారులు పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో వారం రోజుల్లో కేవలం 900క్వింటాళ్ల పత్తిని మాత్ర మే కొనుగోలు చేశారు. వర్షాలకు పత్తి తడవగా, ఆరబెట్టిన తరువాత తీసుకురావాలని సీసీఐ కేంద్రాల నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. దీనికి తోడు స్లాట్ బుకింగ్ ఉండటంతో రైతులు పత్తిని వెంటనే విక్రయించే పరిస్థితి లేదు. 8 నుంచి 12శాతం తేమ ఉంటేనే పత్తిని కొనుగోలు చేస్తారు. నాణ్యమైన పత్తికి క్వింటాకు రూ.8,110 చెల్లిస్తారు. అయితే జిల్లాలో ప్రస్తుతం రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో 5.60లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, 57లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పత్తి వస్తుందని, ఎకరాకు 10 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే ప్రకృతి వైపరీత్యాలతో ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రధానంగా ఎర్రతెగులు, ముడత తెగులుతోపాటు వరుసగా కురుస్తున్న వర్షాలకు పత్తి చేలు దెబ్బతిన్నాయి. పత్తి ఆరిన తరువాతనే స్లాట్ బుకింగ్ ద్వారా తీసుకరావాలని సీసీఐ స్పష్టం చేయడంతో రైతులు అయోమయంలో పడిపోయారు. తేమతో సంబంధం లేకుండా ధాన్యం, పత్తిని కొనుగోలు చేస్తే తప్ప రైతులు గట్టెక్కే పరిస్థితి లేదు.

49వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

ప్రభుత్వరంగ సంస్థలు ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిన నాటి నుంచి ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. ఆడపాదడపా వర్షాలకు తోడు తుఫాన్ రైతును దెబ్బతీసింది. కొద్ది రోజులుగా ప్రారంభించిన ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగాయి. ఇప్పటి వరకు జిల్లాలో 49,152 మెట్రిక్ టన్నుల ధాన్యాన్నే ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేశాయి. 6లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే వర్షాల కారణంగా ధాన్యం తడిసి తేమ పెరిగింది. దీంతో రైతులు కల్లాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికే ఐకేపీ కేంద్రాల్లో 1,79,460 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంది. ప్రస్తుతం ధాన్యంలో తేమ తగ్గితేనే గానీ కొనుగోలు చేసే పరిస్థితి లేదు. తడిసిన ధాన్యంతో పాటు మొలకెత్తిన ధాన్యాన్ని, తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకారం తేమ 17 శాతం ఉంటేనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవడం, ధాన్యం తడవడంతో తేమశాతం తగ్గే పరిస్థితి లేదు. దీనికి తోడు అస్తవ్యస్తంగా ఉన్న ఐకేపీ కేంద్రాలతో సమస్యలు ఎదురవుతున్నాయి. రాళ్లు, రప్పలు, గుంతలను చూడకుండా పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం రాశులపై కప్పేందుకు టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో రైతులు నష్టపోయారు.

ఈ సారైనా మెరుగుపడేనా?



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల నమోదు ను పెంచేందుకు ఇంటర్ విద్యాశాఖ పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అయితే విద్యార్థుల నమోదు పెరిగినంత మాత్రాన ఉపయోగం లేదని, ప్రైవేట్ కళాశాలల కంటే మెరుగైన విద్యనందించి వారితో తక్కువ కాదని నిరూపించేందుకు జిల్లా ఇంటర్ విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. మరి ఈ విద్యా సంవత్సరంలోనైనా ఫలితాలు మెరుగుపడతాయో లేదో చూడాల్సిందే.

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట(కలెక్టరేట్)

గత విద్యా సంవత్సరంలో ఇంటర్ వార్షిక ఫలితాల్లో సూర్యాపేట జిల్లా రాష్ట్రంలో 20కి పైగా స్థానంలో ఉంది. ప్రైవేట్ జూనియర్ కళాశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నారు. అయితే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాత్రం వందశాతం ఫలితాలు రావడం లేదు. 2023- 2024లో ఇంటర్ ప్రథమంలో 48శాతం, ద్వితీయంలో 61శాతం ఉత్తీర్ణత వచ్చింది. ఈ ఏడాది రాష్ట్రంలో సూర్యాపేట జిల్లాకు 28వ స్థానం, ద్వితీయ సంవత్సరంలో 24వ స్థానం దక్కింది. 2024-25 వార్షిక ఫలితాల్లో ప్రథమలో 8,068 మంది విద్యార్థులకు 4,420 మంది ఉత్తీర్ణత (54శాతం) సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 7,518 మంది విద్యార్థులకు 4,983 మంది ఉత్తీర్ణత (66.25 శాతం) సాధించారు. మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి 15,586 మందికి 9,403 మంది ఉత్తీర్ణత (60.32 శాతం) సాధించారు. యాదాద్రి జిల్లాలో 2023-24లో మొదటి, ద్వితీయ సంవత్సరం కలిపి 11,687 మంది విద్యార్థులకు 6,467 మంది ఉత్తీర్ణత (54.50శాతం) సాధించారు. 2024 -25 లో 11,738మందికి 7,390మంది ఉత్తీర్ణత (62.96 శాతం) సాధించారు. ఈ ఏడాది గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇంటర్ అధికారులు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. అందులో భాగంగా ఇప్పటికే సిలబస్‌ను 70శాతం పూర్తి చేశారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థు లు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా పరీక్ష లు రాసి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి కే పలుమార్లు స్లిప్‌టెస్టులు నిర్వహించారు. కాగా, వచ్చే ఏడాది జనవరి నుంచి ఒక్కో సబ్జెక్టుకు సం బంధించి స్లిప్‌టెస్టులు నిర్వహించనున్నారు. ఈ ఫలితాల ప్రకారం విద్యార్థుల్లోని సామర్థ్యాన్ని పరిశీలించి మార్చిలో జరగను న్న వార్షిక పరీక్షలకు సమాయత్తం చేయనున్నారు. గతంలో సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశా ల, నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పా టు పలు కళాశాలల్లో ఆశించిన మేర ఫలితాలు రాలేదు. చాలా మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారు.

ప్రత్యేక వార్షిక ప్రణాళిక...

ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రం లో మెరుగైన స్థానం సాధించేందు కు ఈ ఏడాది కళాశాలల ప్రారంభం నుంచే విద్యార్థులకు ప్రత్యేక వార్షిక ప్రణాళిక రూపొందించారు. ఈనెల...

- మిగతా 7వ పేజీలో...

దేశ సమగ్రతకు కృషిచేసిన పటేల్



రన్‌ఫర్ యూనిటీని ప్రారంభించి పాల్గొన్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రత, ఐక్యత కోసం కృషి చేసిన గొప్ప దేశభక్తుడు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ రన్ ఎన్జీ కళాశాల నుంచి క్లాక్‌టవర్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించి 550కు పైగా సంస్థానాలను దేశంలో విలీనం చేయడంలో వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించడాన్ని కొనియాడారు. అనంతరం పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రాజశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మయ్య, జితేందర్‌రెడ్డి, శ్రీనునాయక్, రఘువీర్‌రెడ్డి, ఆర్ఐ సంతోష్, 500మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి : ఎస్పీ

(ఆంధ్రజ్యోతి, పెద్దవూర): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల్లో ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీచేశారు. పలు కేసుల వివరాలు అడిగి తెలుసుకొని మాట్లాడారు. డయల్ 100కు వచ్చే కాల్స్‌కు తక్షణమే స్పందించాలన్నారు. గ్రామ పోలీసు అధికారులు ప్రతీ రోజు గ్రామాలను సందర్శించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. యువత మాదకద్రవ్యాలు బారిన పడకుండా చూడాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ శ్రీనునాయక్, ఎస్ఐ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

నాంపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. మందుల స్టాక్, పలు రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను ఆస్పత్రి వైద్యాధికారులు డాక్టర్ భవానిసాగర్, డాక్టర్ తరుణ్‌ను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, డాక్టర్ రవి, డాక్టర్ కృష్ణకుమారి, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

నిడమనూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డీఆర్డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఊట్కూరు, మార్వాక గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీచేశారు. రిజిస్టర్లు పరిశీలించి సిబ్బంది, రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్నందున కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. వర్షాలకు రంగు మారిన ధాన్యాన్ని కూడా తేమ శాతం ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోళ్ల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏపీఎం నరహరి, తదితరులు ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కలెక్టర్ ఇలా త్రిపాఠి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన విద్యతో సమాజంలో ఉన్నత స్థాయి, ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో కలిసి కస్తూర్బా గాంధీ పాఠశాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థినులు చక్కగా చదువుకోడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మెనూ ప్రకారం ఆహారాన్ని అందిస్తున్నారా అని అరా తీశారు. ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని పాఠశాల ఎస్‌వో కవితను ఆదేశించారు. పాఠశాలలో రికార్డులను, ఫేస్ రికగ్నేషన్ యాప్ అటెండెన్స్ తీరును పరిశీలించారు. పాఠశాలలో డే వాచ్‌మెన్ పోస్టు భర్తీకి చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల భవనాలను నిర్మించేందుకు అనువైన స్థలాన్ని వ్యవసాయ సబ్ మార్కెట్‌యార్డులో పరిశీలించారు. ఆ తరువాత తహసీల్దార్ కార్యాలయంలో పలువురు రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డీఈవో భిక్షపతి, తహసీల్దార్ అనిల్, ఇన్‌చార్జి ఎంపీడీవో భిక్షంరాజు, ఎంఈవో కె.శ్రీనివాస్, ఏఈ సైదులు, తదితరులు ఉన్నారు.

వెంటనే మిల్లులకు తరలించాలి

(ఆంధ్రజ్యోతి, హాలియా): నిబంధనల ప్రకారం ధాన్యంలో తేమశాతం రాగానే కాంటాలు వేసి వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం అనుముల మండలం రామడుగు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీచేశారు. కొనుగోలు, మిల్లర్ల విషయంలో ఇబ్బందులు ఎదురైతే తహసీల్దార్, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ రఘు, ఉన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న భూ రికార్డులు, భూ భారతి, భూ వివాదాల దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులపై శ్రద్ధ చూపాలి



పెద్దకాపర్తి ఉన్నత పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్రవణ్‌కుమార్

మండల ప్రత్యేకాధికారి, జేడీఏ శ్రవణ్‌కుమార్

చిట్యాల రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు సత్ఫలితాలు సాధించేలా వారికి సాయంకాలం ప్రత్యేక తరగతులను నిర్వహించడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీచేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన రిజిస్టర్లను, వంటశాలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. కోడిగుడ్లను భోజనంలో విద్యార్థులకు వారంలో ఎన్నిమార్లు ఇస్తున్నారని ప్రశ్నించారు. పరిశుభ్ర వాతావరణంలో వంటలు చేయాలన్నారు. చేతులు శుభ్రం చేసుకున్న నీళ్లు వెళ్లేలా ఇంకుడు గుంత నిర్మించాలని సూచించారు. ఉపాధ్యాయుల బోధనలను విద్యార్థులు శ్రద్ధగా వినాలని అనంతరం పాఠ్యాంశాలను మరోమారు పఠనం చేసుకోవాలన్నారు. 10 జీపీఏ అందరూ సాధించేలా చూడాలన్నారు. విద్యార్థులు సత్ఫలితాలను సాధించడంతో పాటు మండలం, జిల్లాస్థాయిలో పాఠశాలకు పేరు ప్రఖ్యాతులను తీసుకువచ్చేలా చూడాలన్నారు. ఆయన వెంట మండల విద్యాధికారి పానుగోతు సైదానాయక్, ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సీపీఎం నేత జూలకంటి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, నవంబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి చేలు నేలవాలి రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. వేలాది ఎకరాల్లో కోతకు వచ్చిన పంట నేలవాలడంతో గింజలు నీటిలోనాని మొలకెత్తడంతోపాటు రంగు మారుతున్నాయన్నారు. రైతులు ఎకరాకు రూ.30వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టారని, అకాల వర్షాలతో పంట దిగుబడి పూర్తిగా తగ్గిందన్నారు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాల ధాన్యం రావల్సి ఉండగా, 20 బస్తాలు రావడం లేదన్నారు. వరి నేలవాలడంతో వరికోత యంత్రంతో నూర్పిడికి అదనంగా రెండున్నర గంటలు పడుతోందని, దీంతో రైతులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం వివరాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేయాలన్నారు. ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారి శర్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, పాల్వాయి రాంరెడ్డి, కోట్ల శ్రీనివాసరెడ్డి, చౌగాని సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



నకిరేకల్‌లో కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాంచందర్‌రావు

నకిరేకల్, చిట్యాల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇటీవలి వర్షాలకు తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తూ శుక్రవారం చిట్యాల పీఏసీఎస్, నకిరేకల్‌లోని చీమలగడ్డ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను అయన సందర్శించారు. మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి, మాట్లాడారు. కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పంట నష్టాన్ని అంచనా వేసేందుకు మూడు బృందాలు పర్యటిస్తున్నాయని, అందులో భాగంగానే ఖమ్మం వెళుతూ రైతుల ఇబ్బందులను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో 15 రోజులుగా రైతులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు తేమ పేరుతో కొనుగోలు చేయకపోవడంతోనే వర్షానికి తడిసి దెబ్బతిందన్నారు. కేంద్రాల్లో ప్యాడీ డ్రయ ర్స్ లేకపోవడంతో రైతులు నష్టపోయారన్నారు. రాష్ట్రం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు టార్పాలిన్ కవర్లు ఏర్పాటు చేయలేదని, దీంతో వర్షానికి ధాన్యం రాశులు తడిసినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మిల్లర్ల తో కుమ్మక్కై ధాన్యం కొనుగోలు విషయంలో తేమశాతం పేరుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గొంగడి మనోహర్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, వీరెల్లి చంద్రశేఖర్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

కాంటావేసిన ధాన్యాన్ని మిల్లుకు తరలించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



నార్కట్‌పల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నార్కట్‌పల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తి చేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికపుడు మిల్లుకు ఎగుమతి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం, నార్కట్‌పల్లి, తొండ్లాయిలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం తరలింపులో పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు.

జువ్విగూడెంలోని శివసాయి రైస్‌మిల్లును, అక్కెనపల్లిలోని చెన్నకేశవ రైస్ మిల్లులను సందర్శించారు. రైస్‌మిల్లుల నిల్వ సామర్థ్యాన్ని ఇప్పటికే వచ్చిన ధాన్యం నిల్వలను తెలుసుకున్నారు. ధా న్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నిల్వలను రికార్డుల ద్వారా తనిఖీచేశారు. కేంద్రానికి అలాట్ చేయబడిన రైస్ మిల్లుకు సత్వరమే ఎగుమతి చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరా అధికారి టీ.వెంకటేష్, జేడీఏ శ్రవణ్, ఏవో గౌతమ్, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, నాయబ్ తహసీల్దార్, ఏఈవోలు ఉన్నారు.

శిశువు అక్రమ

దత్తత కలకలం

- మూడో సంతానంలో ఆడ శిశువు
- దత్తత ఇచ్చారని సమాచారంతో అధికారుల ఆరా

6

'ఆదర్శ' అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిడమనూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల తెలిపారు. టీజీటీ ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ బోధించేందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల జీరాక్స్ కాపీలు, బయోడెటాతో ఈనెల 3న పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆమె సూచించారు.

పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

పెద్దవూర, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో తరి రాము అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం ఆయన పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. అదే విధంగా విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా బుద్ధిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులు కలలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రంపోడు ఎంపీడీవోగా మహేష్ బాధ్యతలు


బాధ్యతలు చేపట్టిన మహేష్

గుర్రంపోడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గుర్రంపోడు ఎంపీడీవోగా జె.మహేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన మం జుల మెదక్‌కు బదిలీ కావడంతో మునుగోడు సూపరింటెంటెండ్ విజయభాస్కర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేశారు. పంజాగుట్ట ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తు మహేష్ ఇటీవల గ్రూప్-1లో ఎంపీడీవోగా ఎంపికయ్యారు. కార్యాలయ సిబ్బంది ఎంపీడీవో మహేష్ సత్కరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పామాయిల్‌ను విస్తృతంగా సాగు చేయాలి

చందంపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పామాయిల్ పంటను రైతులు విస్తృతంగా సాగు చేయాలని పతాంజలి కంపెనీ అధికారి శేఖర్ తెలిపారు. మండలంలోని పోలేపల్లి బండమీదితండాలో పామాయిల్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామాయిల్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం మొక్కలు, డ్రిప్ ఏడాదికి ఎకరానికి రూ. 4వేల చొప్పున ప్రోత్సహం అందిస్తుందని తెలిపారు. రానున్న కాలంలో పామాయిల్‌కు డిమాండ్ పెరుగుతున్న కారణంగా రైతులు విస్తృతంగా సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్, సూర్య, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు డ్యూయల్ డెస్క్ బెంచీల అందజేత

నిడమనూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్కూరు గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి చొరవ, నాట్కో ఫౌండేషన్ సహకారంతో రూ.1.50 లక్షల సీఎస్ఆర్ నిధులతో 25 డ్యూయల్ డెస్క్ టాప్ బెంచీలు, 5 టేబుళ్లను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంఈవో లావూరి వెంకన్న మాజీ జడ్పీటీసీ నందికొండ రామేశ్వరీమట్టారెడ్డి, మాజీ సర్పంచులు నర్సింగు విజయ్‌కుమార్, నర్సింగు కృష్ణయ్య, హెచ్‌ఎం శ్రీధర్, బొల్లేపల్లి జానయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కొండమల్లేపల్లి, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు శుక్రవారం కొండమల్లేపల్లిలో భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నల్లగొండ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపిచంద్ మాట్లాడుతూ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కళాశాల యాజమాన్యాలు సైతం ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పం దించి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేపూరి కార్తీక్, దినేష్, విక్రమ్, చందు, వంశీ, రాజేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలు మందలించారని ఆత్మహత్యాయత్నం

దేవరకొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయురాలు మందలించారనే మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. శుక్రవారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పెంచికల్ పహాడ్ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఈ సంఘటన జరిగింది. దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, సీఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్)మండలకేంద్రానికి చెందిన మాధవి పెంచికల్‌పహాడ్ గిరిజన పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. క్రమశిక్షణతో ఉండాలని బాగా చదువుకోవాలని అక్టోబరు 24వ తేదీన గణితం ఉపాధ్యాయురాలు మాధవిని సహచర విద్యార్థుల ముందు మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. అక్టోబరు 25వ తేదీన మాధవి తల్లి గ్రామం నుంచి హాస్టల్‌కు రావడంతో అప్పటికే మాధవికి స్వల్ప అస్వస్థతతో ఉండడంతో కుమార్తెను అధికారుల అనుమతితో స్వగ్రామానికి తీసుకెళ్లింది. తిరిగి శుక్రవారం మాధవిని తల్లి హాస్టల్‌ను తీసుకువచ్చి చేర్పించి వెళ్లిపోయింది. శుక్రవారం సాయంత్రం మాధవి డెటాల్ తాగి ఆత్మహత్యాయత్నం చేయటంతో సహచర విద్యార్థులు సీసాను తీసుకొని కిందపడేశారు. అప్పటికే కొద్ది మొత్తంలో డెటాల్ తాగటంతో విద్యార్థినికి ఏఎన్‌ఎం ధనలక్ష్మి ప్రథమ చికిత్స చేశారు. ప్రిన్సిపాల్ కల్యాణి, ఏఎన్ఎం, ఉపాధ్యాయులు మాధవిని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులు చికిత్స అందించి మాధవికి ప్రాణాపాయం లేదని తేల్చి చెప్పారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, సీఐ వెంకట్‌రెడ్డి విద్యార్థిని విచారించి వివరాలు సేకరించారు. తల్లిదండ్రులకు కూడా సమాచారం అందించారు. మాధవికి గొంతు నొప్పి ఉండడంతో ఎక్కువ మాట్లాడలేకపోతుందని పూర్తి వివరాలు విచారణలో తేలనున్నట్లు వారు తెలిపారు.

పటేల్ జీవితం స్ఫూర్తిదాయకం

● దేవరకొండ ఏఎస్పీ మౌనిక
● మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లలో జాతీయ ఐక్యత దినోత్సవ ర్యాలీలు



దేవరకొండ 2కేరన్‌లో పాల్గొన్న ఏఎస్పీ మౌనిక, పోలీసులు, తదితరులు

దేవరకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభభాయ్ పటేల్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమనిదేవరకొండ ఏఎస్పీ మౌనిక అ న్నారు. శుక్రవారం వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి సందర్భంగా దేవరకొండ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ ప్రోగ్రాంలో భాగంగా దేవరకొండలో 2 కే రన్ ప్రారంభించి ఆమె మాట్లాడారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం కృషి చేసిన ఉక్కు మనిషి పటేల్ అన్నారు. కార్యక్రమంలో సీఐలు వెంకట్‌రెడ్డి, బీసన్న, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, ఎస్ఐ నారాయణ రెడ్డి, వస్కుల సుధాకర్, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● త్రిపురారం : మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని ఎస్ఐ నరేష్ జెండా ఊపి ప్రారంభించారు. బాబు సాయి పేట క్రాస్ రోడ్ నుంచి శివాలయం వరకు ర్యాలీ నిర్వహిం చా రు. ర్యాలీలో 200 మంది పాల్గొని దేశ ఐక్యతను చాటారు. కార్యక్రమంలో ఎంఈవో రవికుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మడిమళ్ల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : మండలకేంద్రంలో రన్ ఫర్ యూనిటీ రన్‌ను ఎస్ఐ అజ్మీరా రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. 2 కే రన్ కొండమల్లేపల్లి చౌరస్తా నుంచి కోల్‌ముంతలపహాడ్ స్టేజీ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో సీఐ నవీన్‌కుమార్, వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

● వేములపల్లి : మండల కేంద్రంలో 2 కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు రావు ఎల్లారెడ్డి, సిబ్బంది నవీన్‌రెడ్డి, శివశంకర్, శ్రీను, జాఫర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● చందంపేట : పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 200 మందితో ఐక్యత పరుగు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ లోకేష్ ఉపాధ్యాయులు, విద్యార్థు లు, స్థానిక యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● హాలియా : హాలియాలో రన్ ఫర్ యూనిటీ ర్యాలీని హాలియా సీఐ సతీష్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ సాయిప్రశాంత్ సి బ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● డిండి : మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో రన్‌ఫర్ యూనిటి ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలకృష్ణ, బొల్లే శైలేజ్, గిరమోని శ్రీనివాస్, ఏటి కృష్ణ, ఎంఎ.కయూం, పోల వెంకటేష్, గడ్డమీది సాయి, ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, గోవర్ధన్, హుస్సేన్, కాశీపాల్గొన్నారు.

● నిడమనూరు : స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు 2 కిలోమీటర్ల మేరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీ స్ సిబ్బంది, యువత ఐక్య భారత్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఉప్పు సురేష్ మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ : హిల్ కాలనీ బీసీ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహి ంచారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాధవి లత, సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ ముత్తయ్య , సిబ్బంది రాజేశ్వరీ, సైదులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) : మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలోఎస్ఐ వీరశేఖర్ ఎంఈవో శ్రీనివాస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి : మండల కేంద్రంలో ఎస్ఐ శేఖర్ ఆధ్వర్యంలో ర్యాలీనిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి : మండల కేంద్రంలో 2కే రన్‌ను దర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనయ్య, ఎస్ఐ నర్సింహులు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు హట్టినాయక్, జయంధర్‌రెడ్డి, ఆనంద్, కృష్ణ హోంగార్డులు విద్యార్థులు పాల్గొన్నారు

● నేరేడుగొమ్ము : మండలకేంద్రంలో 2 కే రన్‌ను ఆద ర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కొర్ర శిరీష్, ఎస్ఐ నాగేంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు మహేష్, నరేందర్‌రెడ్డి, శ్వేతా, స్వాతి, హోంగార్డులు యాదయ్య, చంద్రయ్య, తిరుపతయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

భారత దేశానికి హోంమంత్రిగా విశేష సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లే శైలేజ్, గిరమోని శ్రీనివాస్, ఏటి కృష్ణ, ఎంఎ.కయూం, పోల వెంకటేష్, గడ్డమీది సాయి, ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, గోవర్ధన్, హుస్సేన్, కాశి పాల్గొన్నారు.


నిడమనూరులో రన్ ఫర్ యూనిటీలో పాల్గొన్న ఎస్ఐ సురేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు

ప్రజలు ఐక్యతతో మెలగాలి : డీఎస్పీ

మిర్యాలగూడ అర్బన్ : ప్రజలు జాతీయత భావాన్ని పెంపొందించుకొని ఐక్యమత్యంతో మెలగాలని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏక్తా దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మత, కులాంతరాలను వీడి ప్రజలంతా దేశభక్తితో జీవనం సాగించాలన్నారు. రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య ఆధ్వర్యంలో అవంతీపురం మార్కెట్‌యార్డునుంచి రూరల్‌పోలీస్ స్టేషన్ వరకు గిరిజన గురుకుల విద్యార్థులతో కలిసి2కే రన్ నిర్వంచారు. కార్యక్రమంలో సీఐలునాగభూషణరావు, సోమనర్సయ్య, పీఎస్డీ ప్రసాద్, ఎస్ఐలు రాంబాబు, సైదిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.


మిర్యాలగూడ ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ రాజశేఖరరాజు, విద్యార్థులు, తదితరులు

తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి


ధాన్యం పరిశీలిస్తున్న మదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రైతులు

మాడ్గులపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తేమ శాత ంతో సంబంధం లేకుండా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పాములపాడు, చిరుమర్తి, ఆగామోత్కూర్, ఇందుగుల గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాలను ఆయన సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దలుగా, నల్లగా మారడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. పంట దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.30 వేలు అందించాలని, ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యానికి తేమశాతంతో సంబంధం లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, మల్లారెడ్డి, పుల్లెంల శ్రీకర్, శ్రీను, నగిరి కృష్ణయ్య, మాధవ్, రాజు, పాల్గొన్నారు.

హరీ‌ష్‌రావుకు పరామర్శ


సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాశం గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

గుర్రంపోడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీ‌ష్‌రావును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. హరీష్‌రావు తండ్రి సత్యనారాయణరావు ఇటీవల మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎం.రాజేష్ రెడ్డి, వేముల యాదయ్య పాల్గొన్నారు.

దేశానికి ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి


మిర్యాలగూడ : ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశానికి ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గాయం ఉపేందర్ రెడ్డి, నీరుకంటి నారాయణ అన్నారు. శుక్రవారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గరీబీ హఠావో నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేసి ఇందిరా, 20 సూత్రాలతో సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో దేశిడి శేఖర్‌రెడ్డి, చిరుమర్రి కృష్ణయ్య, మెరుగు శ్రీను, సుబ్బారావుపాల్గొన్నారు.

● వేములపల్లి : దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన మహా నాయకురాలు ఇందిరాగాంధీ అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారురు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ గంజి శ్రీను, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, నాయకులు పెద వెంకన్న, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి


వేములపల్లి గ్రామ శివారులో నేలకొరిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేములపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వపరంగా ఎకరాకు రూ.25వేలు పరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేములపల్లి, శెట్టిపాలెం గ్రామాల్లో శుక్రవారం తుఫాన్‌తో నేలకొరిగిన పంట పొలాలను ఆయన రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బే షరతుగా రంగుమారిన, మొలకెత్తిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వ గరిష్ఠ మద్దతు ధరకు కొనుగోలు చేయడంతోపాటు పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.25వేల మేర పరిహారం తక్షణమే అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిర్ర మల్లయ్యయాదవ్, మజ్జిగపు సుధాకర్‌రెడ్డి, కట్టా మల్లేష్‌గౌడ్, నంద్యాల శ్రీరాంరెడ్డి, కాంట్రగడ్డ గోపాల్‌రావు, పుట్టల సందీప్, పుట్టల పౌల్, జడ మట్టయ్య, మాలి శంకర్‌రెడ్డి, పెదమాం వీరస్వామి, పాల్గొన్నారు.

శిశు విక్రయాలు, భ్రూణ హత్యలపై అవగాహన కల్పించాలి


హాలియాలో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శాంతి

హాలియా, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, తండాల్లో శిశు విక్రయాలు, భ్రూణ హత్యలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని సీడీపీవో శాంతి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శుక్రవారం అనుముల ప్రాజెక్టు హాలియా సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లకు ని ర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామంలో బాల్య వివాహాలు, శిశు విక్రయాలు, భ్రూణ హత్యలు జరగకుండా చూసుకోవాలని, అలా ఎవరైనా పాల్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సువర్ణ, సూపర్‌వైజర్ రమాదేవి, డీసీపీయూ అధికారి మహేష్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లి : బాల్య వివాహాలను నియంత్రించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ అన్నారు. మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్) అంగన్వా డీ కేంద్రంలో చట్టాలతో పాటు బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్త వయస్సు కలిగిన యువతులకు మాత్రమే వివాహాలు చేయాలన్నారు. కార్యక్రమంలో టీచర్ బాదేపల్లి స్వప్న, ఆయా ఎం.బకృమ్మ, తపాల్గొన్నారు.

● చందంపేట : ఆడపిల్లలను భారంగా భావించకుండా బాధ్యతగా చూడాలని చందంపేట మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యకుమారి అన్నారు. శుక్రవారం పోలేపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటి పడావో బేటి బచావో అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

● నేరేడుగొమ్ము : ఆడపిల్లలను విక్రయించడం చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శోభారాణి అన్నారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం శిశు విక్రయాలు, అక్రమ అమ్మకాలు, చట్టబద్ధమైన దత్తత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీచర్స్ అరుణ సువార్త శారద, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : టీడీపీ

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వర్షానికి దెబ్బతిన్న పంట లకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని టీడీపీ ఓబీసీ విభాగ రాష్ట్ర నాయకుడు పోగుల సైదులు గౌడ్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మొంథా తుపాను కారణంగా ఆరుగాలం శ్రమించి పండించిన పంట నేల పాలు కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. కల్లాలు, ఐకేపీ కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసి మొలకెత్తిందన్నారు. సమావేశంలో తెలుగు రైతు విభాగ నాయకులు లావుడి లింగానాయక్, చారి పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి : ఏఐఎస్ఎఫ్

చింతపల్లి ,అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నలమల్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకోవాలని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పంట నష్టంపై పూర్తిస్థాయిలో అంచనా వేసి రైతులందరికీ పరిహారం రైతు ఖాతాలో జమ చేయాలని పేర్కొన్నారు. పంట చేతికి అందే సమయంలో వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు. రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని వివరించారు.

కార్మికులకు అండగా ఏఐటీయూసీ



దేవరకొండలో జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న నూనె రామస్వామి

మిర్యాలగూడ ,నవంబరు 31(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలపై పోరాడుతూ అండగా ఉండేది ఏఐటీయూసీ జెండా అని ఏఐటీయూసీ ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సయాద్ అన్నారు. ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మిర్యాలగూడ ఎన్‌టీఆర్ కాంప్లెక్స్ వద్ద సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లుతో కలిసి యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి లింగానాయక్, డీహెచ్ఎస్ నాయకులు వల్లంపట్ల వెంకన్న, యూనియన్ కార్యదర్శి ఖయామ్, అఫ్జర్ అలీ, వెంకన్న, రసూల్, హలీ, శ్రీనివాసరాజు, జానయ్య, సత్తార్, సలీం పాల్గొన్నారు.

● దేవరకొండ/ కొండమల్లేపల్లి : దేవరకొండ, కొండమల్లేపల్లిలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో సంఘం జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జూ లూరు వెంకట్రాములు, నీల వెంకటయ్య, అలమని మల్లయ్య పాల్గొన్నారు.

● గుర్రంపోడు : మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి రేపాక లక్ష్మీపతి ఏఐటీయూసీ జెండాను ఆవిష్క రించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఎస్‌కె. అమీర్, జాల పెద నర్సింహ, శంకరచారి, లాలయ్య, నర్సింహ పాల్గొన్నారు.